

# వేంకటపతి ఆటవెలదులు


రచన :

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు M.Tech




## ముందుమాట

నేను శ్రీనివాసచింతన వ్రాస్తున్నప్పుడు సీస పద్యములతో పాటు నూరుకు పైగా ఆటవెలది పద్యాలు వ్రాయటం జరిగింది. అలాగే ఒక నూటికి పైగా రామాయణం (కథ) ఆధారంగ వ్రాశాను. ఆ పద్యాల మకుటం మార్చితే రెండు శతకములు పూర్తి అవుతాయనే ఆలోచన వచ్చింది. వాటికి రెండు వేర్వేరు మకుటములు పెట్టాను. దానితో రెండు వేర్వేరు శతకములు తయారయ్యాయి. ఆ ప్రక్రియలో తయారయిందే ఈ వేంకటపతి ఆటవెలదులు. ఇందులో 120 పైగా ఆటవెలది పద్యాలు ఉన్నాయి. అన్నీ రామాయణం, భారత భాగవతాలలో ఆ విష్ణుమూర్తి లీలలు. భగవంతుని నిందాస్తుతి మనిషి అసహాయ వైరాగ్యం నుంచి వస్తుంది. అదే ఈ శతకాలలో ఎక్కువ కనిపిస్తుంది.

వేంకటపతి ఆటవెలదులు గొప్ప పద్యరచనగా నేను భావించటం లేదు. ఇది ఒక భక్తి రచనగా భావించి



మనస్ఫూర్తిగా భక్తితో చదవండి. ఎంతమంది ఆటవెలదులు ఆస్వామికోసం ఆడినా ఆ మనోహరుడికి ఎక్కువా? ఒక్కొక్క ఆటవెలది ఒక్కో రకంగా ఆయనను అలరించాలని నా ఆశ. అందుకని కొన్ని పద్యాల్లో వేదాంతం కూడా కనిపిస్తుంది. సాధ్యమైనంత తేలిక భాషలో పద్యాలు వ్రాశాను. చాలాచోట్ల ఒకనీతి వాక్యమో లేక సామెతో లేక లోకోక్తో వాడి ఆ పురాణ వాక్యానికి బలం కూర్చటం జరిగింది. మూడు సంవత్సరాల తరువాత ఈ ఆటవెలదులకు మళ్ళీ నగిషీలు చెక్కి ప్రతి పద్యానికి సందర్భోచిత వ్యాఖ్య వ్రాసి కొత్తదనం కూర్చి ఈ విధంగా ముందుంచటంలో ముఖ్యమైన పాత్ర వహించిన డా|| బి.వి.యస్.ఆర్. మూర్తి గారికి సదా కృతజ్ఞుడను.

**ముఖ్య గమనిక :**

కొన్ని సామెతలు నాటి స్త్రీల అనుచిత ప్రవర్తన నుంచి వచ్చాయి. విజ్ఞతగల నేటి స్త్రీలు వీటిని తమకి అన్వయించుకొని ఔరా! అనుకోరాదని నా మనవి.



## ప్రార్థన

ఆ|| శ్రీపతిని తలంచి చేసిన పనులెల్ల
విఘ్నమేది లేక వెలయుచుండు
ఆదిదేవు దలచి ఆరంభమును చేతు
వేంకటాద్రివాస వేంకటేశ

తే|| నీవు ఇచ్చిన ఈ శక్తి నిన్ను పొగడ
వాడుకొందును స్వార్థమేనాడు లేక
పదములంటెద దయచూడు వ్రాయనిమ్ము
వేంకటాద్రిపై వసియించు వేంకటేశ

కం|| రాముడు నీవే, బ్రహ్మయు
సోమధరుండైన నీవె సుందరి నీవే
శ్యాముండు నీవె తండ్రీ!
వేమార్లు నుతింతు శరణు వేంకటనాథా!

ఉ॥ శ్రీపతి నాదు దైవమని చెప్పెద
ఈ విధి 'గోడువెట్టుచున్'
నాపయి చిన్నచూపది వినాశమువంటిది
సైపలేనురా
ఏ పరివారమున్ గొనక ఎవ్విధినా 'కరి'
బ్రోచినాడవో
ఓ పురుషోత్తమా! విడిచి యోచన,
గావుము వేంకటేశ్వరా!

ఆ॥ చేసినాను ఎపుడొ శ్రీరామపదసేవ
అట్లుగాక కవితలల్లగలనె?
నీవె చేసినావు నేనెంత? ఓ ప్రభూ!
వేంకటాద్రివాస వేంకటేశ!

కం॥ ఎందెందు వెదికి చూచిన
అందందే గలవనంచు అందురు కానీ
ఎందెందు 'వెదక' మందువు
ఉందా నాకట్టి 'చూపు' ఓ గోవిందా!



## అంకితం



ఆ॥ జలజభవుని రాణి, జలజనాభుని దేవి
జలజనేత్రయైన శంభురాణి,
జనని దుర్గ వోలె జగతిని రూపొందె
అంకితమ్మునిత్తు నామెకిపుడు



## వేంకటపతి ఆటవెలదులు

**ఆ॥ శ్రీ, వినాయకులను చేరిన ఆ వాణి**
**నాదు నాల్కపైన నాట్యమాడ**
**'వేంకటపతి ఆటవెలదుల' జెప్పెదన్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 1

తా॥ శ్రీలక్ష్మి, వినాయకుల జతయైన సరస్వతీదేవి నా నాలుక మీద నాట్యమాడగా నేను వేంకటపతి ఆటవెలదులు అనబడు ఈ శతకమును చెప్పెదను. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశ్వరా (కరుణించి స్వీకరింపుము).

**ఆ॥ మన్నుతిన్న నోట అన్ని లోకాల్జూపి**
**వెర్రిగొల్లదాన్ని వివశ చేసి**
**క్షణములోన పాపడని ముంచితివి భ్రమన్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 2



తా॥ అమ్మా! తమ్ముడు మన్ను తినేను చూడమ్మా!.... అని బలరాముడు పితూరీ చేశాడు. యశోదకు కోపం వచ్చి నీనోరు చూపించు అని కృష్ణణ్ణి అడిగింది. నమ్మకు వాళ్ళని కావాలంటే చూడు అని నోరు తెరిచాడు. ఆ నోటిలో ఆమెకు లోకాలన్నీ కనిపించాయి. ఆ వెర్రి గొల్లది నివ్వెరబోయింది. ఏమిటి ఇతను నాబిడ్డ కాదా! అనుకుంటుండంగానే క్షణంలో మళ్ళీ భ్రమలో ముంచి నాపాపాయే వీడు అనుకుని ముద్దుపెట్టుకుంది. ఓ వేంకటాద్రి వాసుడవైన వేంకటేశా! (అంతా నీమాయ).

**ఆ॥ భార్యమాట వినక వధియింపబడె 'వాలి'**
**భర్తమాట వినక వగచె సీత**
**చెప్పినపుడు వినక చెడిపోదురో ప్రభూ!**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 3

తా॥ సుగ్రీవుడు వాలితో పోరి బాగా తన్నులు తిని, రాముడి అనునయంతో, ఒక పూలతీగ మెడలో గుర్తుగా ధరించి మళ్ళీ యుద్ధానికి వచ్చాడు. అది చూచి వాలి భార్య తార అనుమానించి భర్తని వెళ్ళ వద్దని వారించింది. ఆమె మాట వినక యుద్ధానికి వెళ్ళి రాముని బాణం దెబ్బతో మరణించాడు. భర్త మాట వినక బంగారు లేడిని చూచి పట్టుబట్టి సీత రాముని పంపించింది. రాముని బాణం తగిలి లేడిగా వచ్చిన మారీచుడు హా సీతా! హా లక్ష్మణా! అని అరచి మరణించాడు. సీతచే బలవంతంగా పంపించి వేయబడిన లక్ష్మణుడు లేనప్పుడు మాయ సన్యాసిగా వచ్చి మోసగించి రావణుడు సీతను అపహరించాడు. మంచి చెప్పితే వినకపోతే చెడిపోతారు. వేంకటాద్రి వాసుడవైన వేంకటేశా! ఈ మాట నిజం.



ఆ॥ ఎద్దు మోయుచుండు నింపుగానీశ్వరున్
గ్రద్ద మోయుచుండు కమలనాభు
జన్మ లెక్క కాదు సర్వేశు కొలువంగ
వేంకటాద్రివాస వేంకటేశ! 4

తా॥ పరమేశ్వరుడు తన వాహనంగా ఎద్దుని స్వీకరించాడు. శ్రీ మహావిష్ణువుని ఒక గ్రద్ద వాహనమై మోస్తున్నది. ఎద్దు నందీశ్వరుడయ్యాడు. గ్రద్ద గరుత్మంతుడు అయ్యాడు. సర్వేశ్వరుని కొలిచే భాగ్యం దక్కటానికి జన్మతో సంబంధం లేదు.

ఆ॥ మనిషికాత్మరక్ష మప్పినదెవ్వరు?
నిప్పువాడుకెవడు నేర్పెమొదట?
అట్టి విద్యనేర్పునాతడే పరమాత్మ
వేంకటాద్రివాస వేంకటేశ! 5

తా॥ వేంకటాద్రివాసుడవైన వేంకటేశ్వరా! మనిషికి తన ఆత్మ రక్షణ చేసుకోవటం ఎవరు నేర్పారు? అడవి



దావానలం చూసి పారిపోయే అతడికి నిప్పును తయారు చేసి స్వంత అవసరాలకి వాడుకోవటం (చలి కాచుకోవటం లాంటివి) నేర్పింది ఎవరు? ఆ పరమాత్మే ప్రకృతి ద్వారా నేర్పుతాడు. ఇది నిజం.

ఆ॥ ధర్మపత్ని సీత ద్యజియించి రాముండు
వగచె శాంతి కొఱకు పత్నిలేక
మోసెతలను దాల్చి "ముళ్ళ కిరీటంబు"
వేంకటాద్రివాస వేంకటేశ! 6

తా॥ అర్ధాంగియైన సీతను వదిలిపెట్టి శ్రీరాముడు మనశ్శాంతి కరువై భార్యకొరకు విలపించాడు. 'చక్రవర్తి' అయి అయిష్టంగానే ముళ్ళ కిరీటం వంటి రాజ్య భారం మోశాడు. పేరుకి కిరీటమే గాని ముళ్ళ బాధ తప్పదు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! ఎలా అనుభవించావు స్వామీ!



ఆ॥ ఆడమగతనాలు అమరు శిఖండికి
జతగ క్రీడిచేర స్యందనమున
వారిసారథైన పరమాత్మనేమందు!
వేంకటాద్రివాస వేంకటేశ! 7

తా॥ ఆడ మగ రెండూకాని ఆ శిఖండిని జతకూర్చుకొన్నది ఫల్గుణుడు అనిపించుకున్న ఆ అర్జునుడే. ఇక వారి రథసారధి స్వయంగా పరమాత్మ శ్రీకృష్ణుడు. ఆయన్ని ఏమనగలం. నిర్దేశకుడవే నీవైన ఓ వేంకటాద్రివాసా! వేంకటేశ్వరా నీ లీలలు అద్భుతం.

ఆ॥ కోటి ఇచ్చెతనువు గొనకొని 'శిబి' నాడు
కవచకుండలాలు కర్ణుడిచ్చె
తారలుండువరకు తమ కీర్తి వెలయంగ
వేంకటాద్రివాస వేంకటేశ! 8

తా॥ 'శిబి' తన శరీరం నుంచి మాంసం కోసి ఇచ్చాడు. 'కర్ణుడు' కవచకుండలాలు కోసి ఇచ్చాడు. తండ్రి మాట నిలుపుటకు శ్రీరామచంద్రుడు అడవికి వెళ్ళాడు. అంతటి త్యాగమూర్తులు కాబట్టి నక్షత్రాలుండే దాక, తరగని కీర్తి సంపాదించారు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! ఇది సత్యం.

ఆ॥ ధర్మ రక్ష కొరకు 'తనవారి' జంపావు
ధర్మస్థాపనంబు ధరణి జేయ
జన్మలెత్తినావు జగతిని పలుమార్లు
వేంకటాద్రివాస వేంకటేశ! 9

తా॥ ఓ వేంకటాద్రివాసా! వివిధ అవతారాలలో నీవు ధర్మ రక్ష కొరకు నీవాళ్ళనే సంహరించావు. ప్రపంచంలో ధర్మ స్థాపన చేయటానికి ఎన్నోసార్లు భూమిపై జన్మలెత్తి జనులలో ఒకడివై తిరుగుతూ వాళ్ళలాగే కష్టాలు అనుభవించే ఓ వేంకటేశ్వరా! నీలీలలు అద్భుతం.



ఆ॥ భామసత్య తలచె భర్తతనకు దాసు
డంచు, గొల్ల కాంతలెంచిరట్లె
భక్తవశుడవయ్య పడతికి కాదయా
వేంకటాద్రివాస వేంకటేశ! 10

తా॥ సత్యభామ 'మీర జాలగలడా నా ఆనతి'..... అనుకున్నది. కృష్ణుడు తనదాసుడని అహంకరించింది. రేపల్లెలో గొల్లభామలంతా మా చీరలెత్తుకెళ్ళే అల్లరివాడు అనుకున్నారు. నిజానికి ఆ పరమాత్మ వశ్యుడయ్యేది భక్తికే గాని సుందరీమణుల సోయగాలకు కాదు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా (ఇది సత్యం.)

ఆ॥ కానలందు పులికి కాన్పయ్యె నేరీతి
జలధిచేపలెట్లు జరిపె సృష్టి
అడవి చెట్లకెవడు అందించె నీరంబు
వేంకటాద్రివాస వేంకటేశ! 11



తా॥ అడవులలో పులికి కానుపెవరు చేస్తున్నారు? సముద్రంలో చేపలు సృష్టి ఎలా చేస్తున్నాయి. అడవి చెట్లకు నీళ్ళు ఎవరు పోస్తున్నారు? వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా ప్రకృతి రూపంలో నీవే ఇవన్నీ చేస్తున్నావు.

ఆ॥ మునుల ఇండ్లకెళ్ళి ముచ్చటలాడంగ
వారుచేసినట్టి వ్రతము లేవొ?
భువికి వచ్చినట్టి పురుషోత్తమా! రామ!
వేంకటాద్రివాస వేంకటేశ! 12

తా॥ మునుల ఆశ్రమాలకు వెళ్ళి, వనవాస కాలంలో వాళ్ళ దీవెనలు తీసుకుని, వారికి నమస్కరించి, మంచీచెడూ మాట్లాడి, వారిని సంతోష పెట్టాడు, శ్రీరామ చంద్రుడు. వారు చేసిన వ్రతములేవో కదా. భూమిపై అవతరించిన ఓ పురుషోత్తమా రామా! నీవే ఆ వేంకటాద్రి వాసుడవైన వేంకటపతివి.



ఆ॥ బావ కొడుకునైన వదలక చంపేవు
చంపమన్న భీష్ము చంపవయ్యె
జాలిలేదు నీకు జగదీశ నిజమయ్య
వేంకటాద్రివాస వేంకటేశ! 13

తా॥ వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! నిజానికి నీకు జాలి లేదనిపిస్తోంది ప్రభూ! ఆనాడు చెల్లెల్నిచ్చి పెళ్ళి చేసిన నీ బావ అర్జునుని పుత్రుడైన అభిమన్యుని యుద్ధంలో ఒంటరిని జేసి దుర్మార్గులైన ద్రోణ, కర్ణ, దుర్యోధన, దుశ్శాసనులవంటి వారిచే, ఒంటరిని జేసి నిర్ధాక్షిణ్యంగా చంపించావు. భీష్ముడు నీ చేతి మరణం మోక్షదాయకం అని శర పరంపర గురిపించి కోపం తెప్పిస్తె చక్రంపట్టి చంపబోయి కూడా అర్జునుని విన్నపంతో చంపకుండా వదిలి పెట్టావు. భీష్ముడిని చంపలేదు. శ్రీకృష్ణ స్వరూపుడైన ఓ పరమాత్మ నీలీలలు ఆశ్చర్యకరం.

ఆ॥ ఆలయంబులోన అన్ని దేవుళ్లకు
పూజచేసినంత పుణ్యమౌనె!
మనసు నిలువనపుడు మాధవు పూజేల?
వేంకటాద్రివాస వేంకటేశ! 14

తా॥ ఒక్కొక్క ఆలయ ప్రాంగణంలో శివుడు, విష్ణువు మాత్రమే కాక వారి పరివారమంతా రకరకాల దేవతలుగా ఉంటారు. ఎవరి ఇష్టదైవాన్ని వారు పూజించుకోవచ్చు. కాని ఆ పూజ మనస్సును ఆ దైవంపై నిలిపి చేయాలి. మాధవునిపైన (దైవంపైన) మనసు నిలువనప్పుడు, ఆ పూజలవల్ల ఏ పుణ్యమూ రాదు. వేంకటాద్రివాసా, వేంకటేశా! ఈ మాట నిజం.



ఆ॥ అలిగి లక్ష్మివీడ ఆమెకై ధరచేరి
వెలసి కాచుచుండె వేంకటపతి
ఒకరి 'ఆట' మారు ఒకరికి 'పాటుగా'
వేంకటాద్రివాస వేంకటేశ! 15

తా॥ ఒకరికి సరదాకి గాని, పంతానికి గాని 'ఆట' అయితే ఆ ఆట ఇంకొకరికి 'పాటు' గా బాధగా మారుతుంది. ఆనాడు భృగు మహర్షి విష్ణువుపై కోపంతో లక్ష్మీ నివాసమైన శ్రీహరి గుండెలపై తంతే శ్రీహరి చిరునవ్వుతో ఆయన కాళ్ళు పట్టుకొన్నాడని అలిగి లక్ష్మీదేవి వైకుంఠం విడిచిపెట్టి భూలోకానికి వచ్చింది. ఆమెని వెతుకుతూ శ్రీహరికూడా ఇలకు దిగివచ్చి వేంకటేశ్వరుడై వడ్డీ కడుతూ నిలిచి పోయాడు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! భళి భళీ!



ఆ॥ కాయమున్నవేళ కఠినమ్ముగా తిట్టి
మంట గలిసినాక మమత లేల?
తరతరాలనుండి జరుగుతున్నది యిదే
వేంకటాద్రివాస వేంకటేశ! 16

తా॥ శరీరం ఉంటేనే జీవితం. శరీరం పోయాక ఏమవుతుందో ఎవరూ చూడలేదు. చూడలేరు. శరీరం మంటల్లో కాలిపోయాక ఎవ్వరూ చేయగలిగిందేమీ లేదు. బ్రతికున్నప్పుడు వాళ్ళని నిర్దాక్షిణ్యంగా తిట్టి పాపం వాళ్ళు చనిపోయాక ప్రేమలు చూపించి ఏడ్చి హడావిడి చేసే వారి వల్ల లాభం ఏముంది? కాని తరతరాల నుండి జరుగుతున్న తంతు ఇదే. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! ఇదే వింత.



ఆ॥ కాళ్లు లేనివాడు కళ్లులేని 'కబంధు'
పట్టి తినగబోవ వానిజంపి
మోక్షమిచ్చినావు మోహనా! శ్రీరాము!
వేంకటాద్రివాస వేంకటేశ! 17

తా॥ శ్రీరాముడు, సీతాపహరణం తరువాత ఆమెకై లక్ష్మణునితో వెతుకుతూ కబంధుడనే రాక్షసుడిచేతులకి తమ్మునితో సహా చిక్కాడు. వాడికి కాళ్ళు కళ్ళూ లేవు. ఎంత పొడుగైనా సాగే చేతులు, అమితమైన బలం ఉన్నాయి. వాడు రామలక్ష్మణుల్ని పట్టుకుని మ్రింగబోతుంటే వాడి చేతులు నరికి వాడిని వధించారు వారు. అంతేకాదు వాడికి విష్ణువయిన ఆ స్వామి మోక్షం ప్రసాదించాడు. మోహనాంగుడు శ్రీరామచంద్రుడవైన ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! భళి భళి.

ఆ॥ పాండవులకు బావ పరమాత్మ కృష్ణుడు
కాని వగచినారు బానిసలుగ
విధినిదాట వశమె విష్ణు సంతతికైన
వేంకటాద్రివాస వేంకటేశ! 18

తా॥ పాండవులకి బావ, శ్రీహరి అయిన ఆ శ్రీకృష్ణుడే కాని జూదంలో కౌరవులతో ఓడిపోయి బానిసలై నిండు సభలో అవమానంతో దుఃఖించారు. ఆ శ్రీమహావిష్ణువు సంతానానికైన విధిని యెదిరించ సాధ్యంకాదు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! విధి బలీయం ప్రభూ!

ఆ॥ పుట్టినప్పుడేడ్పు పోవునప్పుడునేడ్పు
ఏడ్పుతోటె బ్రతుకు ఇదియె వింత
నిన్ను మొక్కుటొకటె నిజముగా నవ్వించు
వేంకటాద్రివాస వేంకటేశ! 19



తా॥ మనిషి పుట్టినప్పుడు ఏడ్పుతోనే ఊపిరి తీసుకుని జీవితం మొదలు పెడతాడు. జీవితాంతం ఇది లేదని అది లేదని ఏడుస్తూనే బ్రతుకుతాడు. ఇదే గొప్ప వింత. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా వాడిని నిజంగా నవ్వించేది అంటే సంతోష పెట్టేది నీకు వినయంగా మ్రొక్కుట మాత్రమే. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా ఈ మాట నిజం.

ఆ॥ పొట్టి వాడు చాల గట్టివాడందురు
ఇంద్రు గెలిచినట్టి ఏలికయిన
బలిని త్రొక్కె 'బుడత' పాతాళ సీమకు
వేంకటాద్రివాస వేంకటేశ! 20

తా॥ పొట్టివాళ్ళు చాలా గట్టివాళ్ళు అని లోకోక్తి. నిజానికి తగిన పొడగరితనం లేక పోవటం కొంత చిన్నతనమైనా భగవంతుడు వాళ్ళకి అదనపు తెలివి తేటలు ఇచ్చి ఆ లోపాన్ని సరిదిద్దుతాడు. శ్రీహరి వామనునిగా అవతరించి వటువై బలిచక్రవర్తి



యాగశాలకి వెళ్ళి 'భవతి భిక్షాం దేహి' అన్నాడు. ఇంద్రుణ్ణి గెలిచి లోకాలన్నీ ఏలుతున్న బలి, ఏం కోరినా ఇస్తానన్నాడు, ముద్దులొలికే ఆ 'బుడ్డోణ్ణి' చూసి. నాకు మూడడుగుల నేల చాలు అని, తీసుకొని త్రివిక్రముడు ఒక అడుగు (పాదము) తో భూమండలాన్ని, ఒక అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడవ అడుగు ఎక్కడ పెట్టమన్నావన్నాడు. నా తల ఒక్కటే నాదని మిగిలింది, దానిపై పెట్టమన్నాడు బలి. అంతే! ఆ తలపై పాదం ఉంచి పాతాళ లోకానికి తొక్కేశాడు పరమాత్మ. ఆ మహిమ చూపిన ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా నమోన్నమః

ఆ॥ ఇలను దనుజ సుతుడె బాలప్రహ్లాదుండు
ఆ విభీషణుండు అసురభ్రాత
పంకమందు బుట్టు పద్మాలు సొగసుగా
వేంకటాద్రివాస వేంకటేశ! 21



తా॥ వేంకటాద్రివాసుడవైన వేంకటేశ్వరా! రాక్షస చక్రవర్తి హిరణ్యకశిపుని కొడుకు బాల ప్రహ్లాదుడు నీ పరమభక్తుడు. లంకాపతి రాక్షస రాజు రావణుని స్వంత తమ్ముడు ఆ విభీషణుడు, రామభక్తుడు. మనోహరమైన పద్మములు పుట్టి పెరిగేది బురదలోనే కదా.

ఆ॥ ప్రాణముండువరకె పాపాలు పుణ్యాలు
ప్రాణమూడు పిదప ఫలములేదు
మంచిచేయుటెల్ల మహిలోన పుణ్యమే
వేంకటాద్రివాస వేంకటేశ! 22

తా॥ మనిషి జీవించి ఉన్నంత వరకే పాపాలుగాని పుణ్యకర్మలు గాని చేయగలడు. ప్రాణం పోయాక వాటి ఫలితం అనుభవిస్తాడు. అంతకుమించి అప్పుడేం చేయలేదు. అసలు పుణ్యం అంటేనే మంచి చేయటం. (చెడు చేయటమే పాపం). వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! ఇదే సత్యం.

ఆ॥ పర్ణశాల మీకు భవనంబుగా దోచె
కటికనేల అయ్యె మేటి 'శయ్య'
కందమూలములను కడు ప్రీతి తింటివే
వేంకటాద్రివాస వేంకటేశ! 23

తా॥ శ్రీరామావతారంలో, శ్రీహరి, తండ్రి దశరథుడిమాట కోసం తమ్ముడు లక్ష్మణునితోను భార్య సీతతోను వనవాసం చేశాడు. లక్ష్మణుడు నిర్మించిన పర్ణశాలలో ఉన్నాడు. దివ్య సౌధాలలో వుండే ఆయన ఆ పాక భవంతిగా భావించాడు. ఉత్తనేలపై అదే చక్కటి పాన్పు అయినట్లు శయనించాడు. ఇక భోజనం కంద మూలములు. అవే కడుపునింపుకోటానికి తిన్నారు. తండ్రిమాట కోసం ఇవన్నీ నహించిన శ్రీరామచంద్రుడవైన ఓవేంకటాద్రివాసా, వేంకటేశా సరిలేరు నీకెవ్వరు.



ఆ॥ తండ్రి లేక పాండుతనయులు దరిజేర
గుడ్డిరాజు కొడుకు 'కొరివి' బెట్టె
కప్ప చేరనగునె కాల సర్పపు నీడ
వేంకటాద్రివాస వేంకటేశ! 24

తా॥ తండ్రి చనిపోయి అనాథలై పిన తండ్రి ధృతరాష్ట్రుని వద్దకు చేరారు పాండవులు. వారిమీద అసూయతో ఆ గుడ్డిరాజు కొడుకైన దుర్యోధనుడు వాళ్ళు నివసిస్తున్న ఇంటికి (లక్క ఇల్లు) నిప్పుపెట్టి అందరినీ సంహరించాలని ప్రయత్నించాడు. ఓ వేంకటాద్రి వాసా! వేంకటేశా! కాలసర్పం పడగ నీడలో కప్ప ఆశ్రయం పొంద గలదా? పొందినా ఎన్నాళ్ళు బ్రతుకుతుంది?



ఆ॥ చంపు కక్షనొకడు, చావుకి చావుతో
బదులు తీర్చు నొకడు పగనుబట్టి
బ్రతుక మేలు కాదె? 'బలుసాకు' తినియైన
వేంకటాద్రివాస వేంకటేశ! 25

తా॥ ఒకడు ఇంకొకడిని కక్ష పెంచుకుని చంపుతున్నాడు. ఆ చావుకి బదులు తీర్చుకోవటానికి ఆ చచ్చినవాడి సన్నిహితులు ఈ చంపినవాడిని ఇంకా ఘోరంగా చంపుతున్నారు. ఈ మారణహోమం జరుగుతూనే వుంది. ఆగటం లేదు. చచ్చి సాధించేదేముంది? నిరుపయోగమైన 'బలుసాకు' తిని యైనా పొట్ట నింపుకుని బ్రతుకవచ్చును కదా! వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశ్వరా! నా పలుకు నిజం ప్రభూ!



ఆ॥ చెంతనున్న సత్య చిందులు వేసెను
చెంతలేని రాధ చేసెనట్లె
విరహబాధ వారి వీడదు ఓ ప్రభూ!
వేంకటాద్రివాస వేంకటేశ! 26

తా॥ విరహం తీవ్రమైన తాపం కలిగిస్తుంది. ప్రియుడు దగ్గర ఉన్నా తృప్తి లేని తాపం, చెంత లేకున్నా లేరన్న తాపం బాధిస్తుంటుంది. సత్యభామకు కృష్ణుడు తనకే కావాలన్న తాపం. రాధకు తను కృష్ణుని దగ్గిర లేదన్న తాపం. ఎలాగైనా బాధే. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! నీకొరకు విరహ బాధ అంతులేనిది ప్రభూ!

ఆ॥ జూదమందు గెలిచి ముదమందె రారాజు,
రమణి తెచ్చి మురిసె రావణుండు,
చేటు కాలమందు చెడు మంచిగాదోచు
వేంకటాద్రివాస వేంకటేశ! 27

తా॥ మాయా జూదంలో శకుని కుతంత్రంతో గెలిచి గర్వంతో పొంగిపోయాడు, రారాజైన సుయోధనుడు ఇక రావణసురుడైతే లోకమాత సీతాదేవిని అపహరించి తీసుకొనిపోయి చెరబట్టాడు. అదీ స్త్రీగా భావించి కామదృష్టితో చూసి, బాధించాడు. మనిషికి చెడిపోయే రోజువచ్చినపుడు చెడుకూడా మంచిలాగానే కనబడుతుంది. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! నీలీల తెలుసుకోలేరు.

**ఆ॥ మంచితనము లేక మహిలోన 'హింసయే'**
**పాపమయ్య వేరు పాపమేది?**
**పాప పుణ్య ఫలము పరమాత్మ ఎరుగును**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 28

తా॥ వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశ్వరా! మంచితనం వదలి వేసి ప్రపంచంలో హింసామార్గం అవలంభించడమే పాపము. వేరే



పాపం ఇంకేముంటుంది. ఈ పాప పుణ్యాఫలం తెలిసేది పరమాత్మవైన నీకే.

**ఆ॥ లక్ష్మణయ్య మూర్ఛ రామనీవేరీతి**
**సైచినావు స్వామి! చెప్పవయ్య**
**మాకువలెనె ఏడ్చు మాధవా! భళిభళి!**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 29

తా॥ ఇంద్రజిత్తు వేసిన దివ్యాస్త్రం వల్ల లక్ష్మణుడు యుద్ధంలో మూర్ఛపోయాడు. అసలే సీతా వియోగంతో నిద్రాహారాలు మాని విచార సాగరంలో ఉన్న శ్రీరామునికి తన తమ్ముని మూర్ఛ గొడ్డలి పెట్టులా అయింది. ఓ వేంకటాద్రివాసా! రామావతారంలో నీవు ఆ బాధ ఎలా సహించావు! చెప్పవయ్యా స్వామీ! ఓ మాధవా! మాబోటి మానవ అర్భకుల్లాగా ఏడ్చిన ఓ వేంకటేశ్వరా! భళిభళీ.



**ఆ॥ మగువకోక విప్ప మానహీనులు నాడు**
**ఎరిగి ఛీత్కరించె నెల్ల జగతి**
**ఉల్లిపాయ తిన్న వెల్లడించదె నోరు?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 30

తా॥ మాన మర్యాదలు లేని కౌరవ ముష్కరులు ఆనాడు నిండు సభలో ద్రౌపది చీర ఊడదీయబోతే ఆర్తజన రక్షకుడైన శ్రీకృష్ణుడు అక్షయమైన చీరలిచ్చి కాపాడినాడు. ఈ సంగతి తెలిసిన ప్రపంచమంతా ఛీ! ఛీ! అన్నది. వెల్లిపాయ తింటే ఆ వాసనే తిన్నవాళ్ళని నిరూపిస్తుంది. కంపుకొట్టే మనిషి దుశ్చర్య కూడా అంతే దాచటం సాధ్యంకాదు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! ఈ మాట నిజం.



**ఆ॥ విషము కక్కి కొలను విషపూరితము జేసి**
**గోగణాల జంపు క్రూర ఫణిని**
**కాళ్లతొక్కి, నాడు కాళీయుమర్దించు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 31

తా॥ కాళీయుడను సర్పరాజు విషము కక్కి కొలనంతా విష పూరితం చేసి అందులో స్నానం చేసే గోవులనూ ఇతరులను చంపసాగింది. దానిమీదకు దూకిన బాలకృష్ణుడు ఆ కాళీయుడి పడగల మీద నృత్యంచేసి, కాళీయుడిని రక్తం కక్కుకొనేట్లు చేసి, ఆ తాండవ కృష్ణుడు అందరినీ కాపాడాడు. అటువంటి ఓ వేంకటేశ్వరా! వేంకటాద్రి వాస! పాహిమాం పాహిమాం.

**ఆ॥ కపట భిక్షువాయె ఖలుడు లంకేశుండు,**
**కుంతికోరి వరము కొడుకు జంపె**
**ఆశ మనిషి చేత ఆడించునాటలు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 32

తా॥ పరస్త్రీయైన సీతకి ఆసపడి లంకకే అధిపతి అయిన దురాత్ముడు అయిన రావణాసురుడు మోసకారి సన్యాసివలె భిక్షకొచ్చి 'మాయోపాయంతో' సీతని అపహరించాడు. కుంతీదేవి కర్ణునివద్దకు వచ్చి యాచించి పాండవుల్ని కాపాడుకోవాలని వరం పొంది అతని మరణానికే కారణమయింది. వేంకటాద్రివాసుడవైన వేంకటేశ్వరా! ఈ ప్రపంచంలో ఆశ మనిషి చేత ఎన్ని ఆటలైనా ఆడిస్తుంది. చివరికి తన దుఃఖానికే కారణమవుతుంది.

**ఆ॥ కామ, క్రోధ, మోహ, కాపీన, మద, మచ్చ**
**రములు ఆరు నేటి 'పాము' లయ్య!**
**నాకు సాధ్యమౌనె నరకంగ వాటినిన్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 33



తా॥ అరిషడ్వర్గములని పిలువబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మచ్చరములు కాటువేసి చంపు సర్పముల వంటివి. వాటిని నరికి చంపటం నావల్ల అవుతుందా? వేంకటాద్రివాసుడవైన వేంకటేశా శరణు శరణు.

**ఆ॥ ఆత్మలింగమొందె ఆ రావణుడు, కాని**
**సీతను చెరబట్టి జేరె 'యముని'**
**చేయ రంకు ఒకటి చెడు నూరు నోములున్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 34

తా॥ తల్లికిచ్చిన మాటకోసం ఘోరమైన తపస్సుచేసి రావణాసురుడు శివుని ఆత్మలింగం కావాలని వరం అడిగి ఆత్మలింగం పొందాడు. అటువంటి రావణ బ్రహ్మ స్త్రీకాంక్షకు బానిసై సీతాదేవిని చెరబట్టి రాముని చేతిలో మరణించి యముని చేరుకున్నాడు. నూరు నోములు నోచిన పతివ్రతైనా ఒక్కరంకు



(వ్యభిచరించుట) చేస్తె నోముల ఫలం నశించి పాపి అవుతుంది. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా ఇది నిజం.

**ఆ॥ తమ్మునొకడు అణచి తగిలె వాని సతిని**
**వదిన చీర ఒలిచె పాపి ఒకడు**
**నీతి లేని వాడు నీచానికొడిగొట్టు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 35

తా॥ రామాయణ కాలంలో ఒక దుర్మార్గుడు తన స్వంత తమ్ముని ఓడించి అణచిపెట్టి వాని భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. వాడు వాలి. వాడికి ఒక వరం వుంది. ఎవరు వాడి యెదురుగా నిలబడి యుద్ధం చేస్తే వాళ్ళకున్న బలంలో సగం బలం వాలికి వస్తుంది. వాలి వానర రాజు. తన తమ్ముడు సుగ్రీవుని అపార్థం చేసుకుని వాడి భార్యను లాక్కొని ఆ



దుష్కార్యం చేస్తే శ్రీరాముడంతటి వాడు చెట్టు చాటునుంచి బాణం వేసి చంపాల్సి వచ్చింది. భారతం నాడు ఒక దురాత్ముడు తన వదినగారు కట్టుకున్న చీరెను నిండు సభలో విప్పదీసి అవమానించాడు. వదిన, స్వంత తల్లితో సమానం అని మన ధర్మశాస్త్రం చెబుతున్నది. ఆ దుర్మార్గుడు దుశ్శాసనుడనే వాడు. ఆ వదిన ద్రౌపదీ దేవి. నీతిలేనివాడు ఎంత నీచానికైనా సిద్ధపడతాడు. వేంకటేద్రివాసుడవైన ఓ వేంకటేశా! ఇది నిజం.

**ఆ॥ జలధి చేపకైన జనకుండవీవయ్య**
**నింగినెగురు పక్షి నీదు సంతు**
**అవనినున్న చెట్లు అయ్యరో! నీసృష్టె**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 36

తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! మహా సాగరంలోని చేపలకు తండ్రి (పుట్టుకకు కారకుడు) ఎవరు? ఆకాశంలో ఎగిరే పక్షులు ఎవరి సంతానం. ఓ అయ్యా వేంకటేశ్వరా! భూమి మీద వుండే చెట్టు నిస్సందేహంగా నీసృష్టే కదా! వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా నామాట నిజం.

ఆ॥ **ధర్మహాని జరిగి ధర్మజుండోడెను**
**పరువు మంటగలిసి బాధపడెను**
**వ్యసనపరుని గావ వనమాలి తరమౌనె?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 37

తా॥ ధర్మానికి హాని జరిగి మాయాజూదంలో కౌరవుల కుయుక్తి వల్ల ధర్మరాజు ఓడిపోయి సర్వమూ కోల్పోయాడు. తనతోబాటు తన నలుగురు తమ్ములనూ పాంచాలినీ ఓడిపోయాడు. ద్రౌపది నిండు సభలో వస్త్రాపహరణం నుంచి శ్రీకృష్ణుని



దయచేత మాత్రమే రక్షింపబడింది. పరువు మంట కలిసి అంతా వ్యధ చెందారు. వనమాలి అయిన ఆ శ్రీకృష్ణ పరమాత్మ కూడా సచ్ఛీల ద్రౌపదిని కాపాడ గలిగాడు. కానీ వ్యసనపరుడై జూదం ఆడిన ధర్మరాజుని దుష్కీర్తినుంచి కాపాడలేకపోయాడు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! ఇది నిజం.

ఆ॥ **అత్తకొడుకు చచ్చె ఆ శిశుపాలుండు**
**చెల్లికొడుకు జచ్చె, చింతలేదు.**
**కర్మసాక్షికెట్లు కల్గును బంధాలు?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 38

తా॥ ఓ ప్రభూ! నీ స్వంత మేనత్త కొడుకు శిశుపాలుడు చచ్చిపోయాడు. అదీ నీ చేతిలో. నీ స్వంత చెల్లి కొడుకు ముద్దుల మేనల్లుడు అభిమన్యుడు యుద్ధంలో మరణించాడు. నీకు ఏమాత్రం దుఃఖం లేదు. నీవు



కర్మసాక్షివి. నిన్ను ఏ బంధమూ కట్టలేదు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! రాగబంధాలు లేని పరమాత్ముడవు, రక్షమాం రక్షమాం.

ఆ॥ **రాజ్యకాంక్షవలన రాజులు చచ్చిరి**
**ధనము కోరి నరుడు కనడు మంచి**
**కాంక్ష కారణంబు కడగండ్లకెల్లను**
**వేంకటాద్రివాస వేంకటేశ** 39

తా॥ రాజ్య కాంక్ష వలన దండయాత్రలతో పగ బెంచుకొని రాజులు ప్రజలకు అనేక కష్టాలు కలిగించి, తామూ నశించిపోయారు. మనుష్యులు ధనకాంక్ష వలన మంచి అనేదే మరచిపోయారు. అన్ని కష్టాలకు కారణం అలివి కాని కోరిక. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! ఈ కాంక్షా పిశాచినుండి నన్ను కాపాడ రాదా?



ఆ॥ **స్వామికిచ్చునట్టి 'వడల' ప్రసాదము**
**స్వామి చేసినాడ ఏమి? కనుక**
**పాసిపోవకున్నె పదినాళ్ళు గడచినన్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 40

తా॥ ఆలయంలో స్వామికి పొంగలి, పులిహోర, వడలు ప్రసాదంగా అర్పిస్తారు భక్తులు. నాలుగు రోజులు ఆ ప్రసాదాన్ని వినియోగించక దాచి యుంచితే పాచిపోయి దుర్గంధాన్నివ్వడమే కాక తిన్నవారికి అనారోగ్యం తెస్తుంది. ఎందుకంటే ఆ ప్రసాదం చేసింది ఆ స్వామి కాదుగదా! వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! ప్రకృతి ధర్మం అనివార్యం ప్రభూ!

ఆ॥ **కంటినీరు పెట్టె కౌసల్య ఆనాడు**
**ఆ యశోద ఏడ్పుకంతులేదు**
**తల్లి నేడిపించు దైవమా! మేమెంత**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 41

తా॥ సాధారణంగా మనకి అండగా ఒక గొప్పవాడుంటే వాడు మనని ఉద్ధరిస్తాడు. ఇంక బెంగ అక్కర లేదను కుంటారు. ఆ అండ తనకొడుకే అయితే ఇక చెప్పేదేముంది? వేంకటాద్రివాసా ఓ వేంకటేశ్వరా! నీ విషయంలో అలా కాలేదు స్వామీ! రామావతారంలో కౌసల్య భర్తపోయి కొడుకు అడవులకెళ్ళి కన్నీరు పెట్టింది. అల్లారుముద్దుగా పెంచిన యశోద ఏడ్పుకంతేలేదు. నీవు దైవానివే! కన్నతల్లినే కన్నీరు పెట్టించగల నీకు మా కన్నీరు ఏం లెక్క, అసలు మేమెంత?

**ఆ॥ అణచినావు నాడు ఆ జరాసంధునిన్**
**మల్లయుద్ధమందు మట్టిజేయ**
**పుల్ల చీల్చిచూపి బోధించి భీముకున్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 42



తా॥ ఆరోజు, ఆ జరాసంధుని అణచి అంతం చేయుటకు భీముని అతనితో మల్లయుద్ధం చేయుటకు పురిగొల్పి ఆ జరాసంధుని చావు రహస్యం తెలియుట చేత అతనిని రెండుగా చీల్చిన ప్రతిసారీ ఆ చీల్చబడిన రెండు భాగాలూ తిరిగి అతుక్కుని మళ్ళీ యుద్ధం చేస్తూంటే దిగ్భ్రమ చెందిన భీమునికి, ఆ చీల్చిన భాగాలను వ్యతిరేక దిశలలో అపసవ్యంగా పడేయాలని ఒక పుల్లను చీల్చి చూపి, భీమునిచే ఆ పని విజయవంతంగా చేయించి జరాసంధుని మట్టు బెట్టించిన శ్రీకృష్ణరూపా, ఓ వేంకటాద్రి వాసా! వేంకటేశా! నీ లీలలు అద్భుతం.

**ఆ॥ కన్నతల్లికైన కడుపు నింపనివాడు**
**పుట్టనేమి పుడమి గిట్టనేమి**
**ఊరకుక్కవాడు ఉండినా లేనట్లె**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 43



తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! తన కన్న తల్లికి కూడా కడుపునిండా అన్నం పెట్టని నీచుడు పుడితేనేమి భూమ్మీద చస్తేమాత్రం పెద్ద తేడా ఏముంటుంది? ఊళ్ళో లెక్కలేనన్ని ఊరకుక్కలుంటాయి. అవి కాపలా కొరకు కూడా పనికి రావు. విచ్చల విడిగా తిరుగుతూ వంటింట్లో వంటని కెలికిపాడు చేసి, తిట్లు రాళ్ళ దెబ్బలు తింటూ అరుస్తూ వుంటాయి. అంత నీచమైన బ్రతుకు గడుపుతారు. వాడు ఉన్నాలేనట్లే.

**ఆ॥ జయ, విజయులు నాడు సనకసనందన**
**ఆదిమునుల శాపమందినారు**
**జగతి వారు పుట్ట జరిగెను హరికథల్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 44

తా॥ వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! పూర్వకాలంలో సనక సనంద నాదులు అనే బ్రహ్మ మానస పుత్రులు



కలరు. వారు యధేచ్ఛగా ఏ లోకానికైనా పోగలరు. త్రిమూర్తులలో ఎవరినైనా చూసి రాగలరు. వారొకసారి విష్ణు సందర్శనానికి పోతే ద్వార పాలకులైన జయ విజయులు స్వామి ఏకాంతానికి భంగమని వారిని లోనికి పోనీయలేదు. వారు కోపించి మీకు విష్ణు సాన్నిహిత్యం పోవాలని శపించారు. విష్ణువు దుఃఖిస్తున్న జయ విజయులను ఓదార్చి మిత్రత్వంతో ఏడు జన్మల ఎడబాటు కావాలా శత్రుత్వంతో మూడు జన్మల ఎడబాటు కావాలా అని అడిగాడు. శత్రుత్వమైనా ఎడబాటు ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదన్నారు వారు. సరే అన్నాడు నారాయణుడు. మొదటి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్య కసిపులుగాను, రెండవ జన్మలో రావణ, కుంభకర్ణులుగాను, మూడవ జన్మలో శిశుపాల, దంతవక్త్రులుగాను జన్మించి విష్ణు ద్వేషంతో వరాహ, నరసింహ, రామ, కృష్ణుల

అవతారాలలోని విష్ణువుచే చంపబడి ఆఖరికి వైకుంఠం చేరారు. ఎన్నో హరికథలకు కారకులయ్యారు.

ఆ॥ **మొల్లమాంబ నాడు అల్లె రామునిగాథ**
**పనిచె పోతరాజు భాగవతము**
**కొలిచిరెల్ల నిన్ను కోటిరీతుల ప్రభూ!**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 45

తా॥ మొల్లమాంబ అను లలనామణి (ఈమెనే కుమ్మరి మొల్ల అంటారు) శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి స్త్రీ. ఈమె రామాయణం రచించి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చింది. ఆమె మానసికంగా శ్రీరామునే పతిగా భావించింది. పోతరాజు అని పిలువబడే (భాగవత గ్రంథం ఆంధ్రీకరించిన) బమ్మెర పోతన, వ్యాసుని భాగవతం తెలుగులో మాకందించి మా జీవితాలు ధన్యం చేశాడు. ఓ వేంకటేశ్వరా!



వేంకటాద్రివాసా! ఎంతోమంది నిన్ను కోటి విధములుగా కొలిచి సేవించి, తరించారు ప్రభూ!

ఆ॥ **శివునిలింగమెక్కి చిట్టెలుకలు దూకు**
**చీమలెల్ల పట్టు చెదలు పట్టు**
**శుభ్రతయును లేక చొరకున్నె ఈగలు?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 46

తా॥ ఏ ఆలయమైనా పరిశుభ్రత పాటించాలి. అప్పుడే ఆలయం పవిత్రతను నింపుతుంది. లేకపోతే ఆ శివలింగం మీద చిట్టెలుకలు ఆడుకుంటుంటాయి. చీమలు పట్టుతాయి. ఈగలు వాలుతుంటాయి. అలాగే కొన్నాళ్ళుంటే చెదలు కూడా పట్టవచ్చు. పరమాత్మ మెచ్చుకునేది పరిశుభ్రతనే. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఇది సత్యం.



ఆ॥ **త్రిజగములను ఏలు దేవేంద్రుడానాడు**
**కోడివోలె కూసె కుటిలుడాయె,**
**బుద్ధి గడ్డి తినును బుద్ధిమంతులకైన**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 47

తా॥ భూలోకంపైన మూడు లోకాలున్నాయని పురాణాలు చెబుతున్నాయి. అవి భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము. వీటిని ఇంద్రుడు పరిపాలిస్తుంటాడు. పితృ దేవతలే కాక గంధర్వ విద్యాధరులవంటి అనేక రకాలైన దేవతలు నివసిస్తుంటారు. దేవలోకాలని కూడా అంటారు. సువర్లోకాన్ని స్వర్గలోకమని కూడా అంటారు. ఒక్కొక్క లోకానికి ఒక్కొక్క రాజధాని ఉంది. స్వర్గానికి అమరావతి రాజధాని. ఈ మూడు లోకాలకి ఏలిక సురపతి అయిన దేవేంద్రుడు. అతడు గౌతముడనే ముని భార్య అహల్యను మోసగించి ఆమెని లొంగదీసుకున్నాడు. కోడిలా కూతపెట్టి ఆ



మునిని తెల్లవారకుండానే స్నానానికి పంపి ఆమెను అనుభవించాడు. తదనంతం శాపం పొందాడు. అహల్యకూ శాపం తెప్పించాడు. ఓ వేంకటేశా! వేంకటాద్రివాసా! బుద్ధిమంతులకు కూడా బుద్ధి గడ్డి తింటుంది కదా!

ఆ॥ **పడతి కోరువాడు, పుడమి కోరెడివాడు,**
**బలిమి కోరువాడు బాగుపడడు**
**ఎంత అనుభవించి 'ఇకచాలు' అనలేరు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 48

తా॥ ఈ ప్రపంచంలో స్త్రీవ్యామోహం ఉన్నవాడు, (రాజ్యకాంక్ష) భూమిమీద వ్యామోహం ఉన్నవాడు బలిమి (అధికార వ్యామోహం) మీద ఆశగలవాడు, చెడిపోతారు. బాగుపడలేరు. ఎందుకంటే ఈ వ్యామోహాలు ఎంత బలమైనవి అంటే ఎంత అనుభవించినా తృప్తి

కలగనీయవు. ఇకచాలు వద్దు అనలేరు. ఓ వేంకటేద్రివాసా! వేంకటేశా! నీమాయ అపారం.

**ఆ|| నారదునికి గర్వనాశనమొనరించి**
**సత్యభామకట్లె జరిపినావు**
**చెడ్డత్రోవ బట్టు బిడ్డల కాపాడు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 49

తా|| నారదుడు బ్రహ్మ మానస పుత్రుడు. ఆయన కామ గమనంతో ఏ లోకానికైనా పోగలడు. గొప్ప సంగీత విద్వాంసుడు. నారాయణుని పరమ భక్తుడు. అట్లే సత్యభామ, శ్రీకృష్ణుని కత్యంత ప్రియభార్య. రాగ బద్ధులైన వారికి గర్వం కలగడం సహజం. ఆ గర్వాన్ని నిర్మూలించటమే శ్రీహరి పని. ఆ క్రమంలో ఆయన వారి గర్వభంగం ఎన్నోసార్లు చేశాడు. చెడు అలవాట్లు నేర్చుకున్న బిడ్డను కాపాడాలంటే తండ్రికి దండించక



తప్పదు కదా. ఓ వేంకటేశ్వరా వేంకటాద్రివాసా తండ్రివి నీవేం చేసినా మా మంచికే కదా.

**ఆ|| ఇంద్రుడైనగాని చంద్రుడైననుగాని**
**నీతి లేక తాము పతనమైరి**
**మన్మథుండు కూడ మంటలో కలిసెను**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 50

తా|| ఇంద్రుడు అహల్యని పాడు చేయుటలోను, చంద్రుడు గురుపత్ని తారతో సంబంధం పెట్టుకొనుట చేతను తాము నీతి భ్రష్టులై చెడిపోయారు, శపించబడ్డారు. శ్రీమహావిష్ణువు యొక్క స్వంత కుమారుడు మన్మథుడు కూడా తపోదీక్షలో వున్న శంకరుడిపై తన పంచ పుష్ప బాణాలు వేసి ఆ శివునికి పార్వతియందు కోర్కె కలిగేట్టు చేశాడు. కానీ శివుడు ఆగ్రహించి



త్రినేత్రం తెరువగానే దగ్ధమై పోయాడు. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! నీతి బాహ్యులు అయిన వారికి పతనం తప్పదు.

**ఆ|| శివుడు మనసునందు చేరియుండునుగాని**
**లింగమందు కలడె? లేదు, లేదు**
**వదలకుండకాచు పరమాత్మ భక్తుల**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 51

తా|| వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! పరమ శివుడు తన భక్తుల మనస్సులో నెలకొని ఉంటాడు. లింగములో ఉండడు. ఆ శివలింగం మనస్సు లగ్నం చేయటానికి సాధనం మాత్రమే. ఒక్కసారి మనస్సు ఆ స్వామిపై లగ్నం చేస్తే ఆ పరమాత్మ తన భక్తుని వదిలిపెట్టడు (శివకేశవులకు బేధమే లేదు)



**ఆ|| వాలి చచ్చె నాడు వాని తమ్మునివల్ల**
**కూలె రావణుండు గుట్టు చెడగ**
**ఇంటి గుట్టు రట్టు ఇలకొంపకూల్చదా?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 52

తా|| ఆనాడు తన స్వంత తమ్ముడు పరాయివాడైన శ్రీరామునికి తన అన్న వాలి గుట్టు మట్టులన్నీ చెప్పి ఎదురు నిలిచి పోరే వాడి బలంలో సగం బలం తనకు వచ్చే వరం ఉన్న వాలిని చాటునుంచి చంపాలని చెప్పి మరీ చంపించాడు. రావణాసురుడు కూడా రామ రావణ యుద్ధంలో మరణించుటకు కారణం విభీషణుడు. తన అన్న గుట్టునంతా శ్రీరామచంద్రుడికి వివరించటమే. ఈ ప్రపంచంలో ఇంటి గుట్టు కాస్తా రట్టయితె (బయట పడితే) కొంప కూలుస్తుంది కదా. వేంకటాద్రివాసా! వేంకటేశా! ఇది సత్యం.

ఆ॥ సుత శతంబుగన్న సుదతి గాంధారికిన్
కొరివిపెట్టనొక్క కొడుకులేడు
ఖరము పాలు ఏల కడవల నిండుగా
వేంకటాద్రివాస వేంకటేశ! 53

తా॥ తన పెద్ద తోడి కోడలు కుంతి తన కన్నా ముందుగానే ధర్మరాజుని కని రాజ్యానికి వారసుడినిచ్చిందని అసూయతో తను గర్భ విచ్ఛేదన చేసుకొని వ్యాసుని అనుగ్రహంతో ఆ విచ్ఛిన్న పిండం నూరు ముక్కలనుంచి దుష్టులైన నూరుగురు కౌరవులని కన్నది. అయితే చివరికి ఏమైంది? కురుక్షేత్ర యుద్ధంలో అందరినీ పోగొట్టుకుంది. తనకి కొరివి పెట్టటానికి ఒక్క కొడుకు కూడ మిగలలేదు. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! మనిషి త్రాగుటకు ఉపయోగించని గాడిద పాలు కడవల నిండుగా ఉండి ఏం లాభం? ప్రభూ!



ఆ॥ ఆలిధనము కొరకు అంగలార్చెడివాడు,
అన్నమమ్మి అధికుడైనవాడు,
చదువు 'కొనెడి' వాడు సంఘాన రాజయ్యె
వేంకటాద్రివాస వేంకటేశ! 54

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఎంత విచిత్రం! స్వామీ! భార్య డబ్బుకోసం కక్కుర్తి పడేవాడూ, అన్నపూర్ణ అని పెద్దలు భక్తితో పిలిచే అన్నాన్ని అమ్ముకుని గొప్పవాడైన వాడు, చదువుని 'కొనుక్కుని' మరీ చదువుకున్నవాడు నేటి సంఘంలో అగ్రనాయకులై పోయారు. ఈ అగ్రనాయకుల చేతిలో ప్రపంచం ఏమవుతుందో!

ఆ॥ హరికి తండ్రియైన ఆ వసుదేవుండు
గాడిద పదమంటి కరుణ వేడె
కార్య సాధనందు కష్టాలు తప్పవు
వేంకటాద్రివాస వేంకటేశ! 55



తా॥ దేవకీ దేవి అష్టమ సంతానంగా శ్రీహరి జన్మించాడు. భగవదాజ్ఞపై ఆ శిశువును రేపల్లె తీసుకొనిపోయి అక్కడ యశోదకి జన్మించిన యోగ మాయతో మార్పిడి చేసే బాధ్యత వసుదేవునకు ఒప్పగించ బడింది. ఆటంకాలన్నీ నిర్మూలించబడతాయి అని చెప్పబడింది. దేవకీ దేవితో సహా మధుర, రేపల్లెలలో అంతా గాఢ నిద్రలో ఉన్నారు. ముగ్గురే మెలకువతో ఉన్నారు. వసుదేవుడు, రేపల్లెలోని ఆయన రెండవ భార్య రోహిణి, వసుదేవుడికి కాపలా ఉండే గార్ధభాసురుడు. సంకెలలు తెగిపోయిన వసుదేవుడు శిశువుతో (శ్రీకృష్ణునితో) బయలుదేరాడు. గాడిద ఓండ్ర బెట్టబోయింది. చటుక్కున ఆ గాడిద కాళ్ళుపట్టుకుని గార్ధభానురా! అరవకు దయచూపించు అన్నాడు. కార్య సాధనలో అల్లులను వేడుకున్నా తప్పులేదు.ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఇది సత్యం.



ఆ॥ ద్రుపదు తనయ ఏడ్చి దునిమించె 'కురుమూక'
రమణి సీత ఏడ్వలంక కాలె
అతివ కంటినీరు అణగించు నందరిన్
వేంకటాద్రివాస వేంకటేశ! 56

తా॥ ద్రుపదుని పుత్రిక ద్రౌపది తన వస్త్రాపహరణావమానం సహించలేక ఏడ్చి కౌరవుల సర్వ నాశనమునకు కారణమైంది. సీతాదేవి కూడా రావణునిచే అపహరించబడి లంకలో నిస్సహాయయై రోదించగా పవనసుతుడు ఆంజనేయునిచే లంకాదహనం జరిగింది. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! స్త్రీ యొక్క కన్నీరు అందరినీ నాశనం చేస్తుంది. ఆమెను బాధించరాదు.

ఆ॥ మనిషి స్త్రీని జూచి మత్తెక్కి ఆశించు
వద్దు అనిన వినడు వదలడేల?
నీదు మాయబడును నిండు జీవితమంత
వేంకటాద్రివాస వేంకటేశ! 57

తా॥ మనిషి ఇంద్రియాలకు బానిస కావున స్త్రీని చూడగానే వ్యామోహానికి బానిసై ఆమె నాశించి చెడిపోతాడు. తను అంతరాత్మ బోధనీ, గురువుల బోధని వినడు. ప్రభూ! వేంకటేశ్వరా! వేంకటాద్రివాసా! నీ మాయలో తగులుకొని నిండు జీవితమంతా వృధా చేసుకుంటాడు. నిన్ను తెలుసుకోలేడు.

**ఆ॥ మౌనివేషమందు మాత సీతను భిక్ష**
**మడిగి మోసపుచ్చె అసురుడపుడు**
**గొర్రెతాను నమ్ము క్రూర కసాయినె**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 58

తా॥ యతి వేషంలో భిక్ష అడిగాడు పర్ణశాలకు వచ్చి రావణాసురుడు. (బంగారు లేడిని తరుముతూ రాముడు వెళ్ళాక. హా సీతా! హా లక్ష్మణా అని రాముని కేకలు వినిపించాయి. నిష్ఠూరాలాడి



లక్ష్మణుడిని రాముడి కోసం పంపించింది సీతమ్మ. మనసంతా ఆందోళనగా ఉంది) అన్య మనస్కంగానే భిక్ష వేయబోయింది ఆమె. మేం గృహస్థుల ఇళ్ళలోనికి వెళ్ళం. నువ్వే బయటకు వచ్చి భిక్ష వెయ్యి అని గర్జించాడు దొంగ భిక్షువు. తన భర్తని శపిస్తాడేమో అని భయపడి 'లక్ష్మణ రేఖను' దాటి వచ్చి రావణాసురిడికి చిక్కిందా తల్లి. ప్రపంచంలో అమాయకమైన జంతువులు గొర్రెలు. గొర్రె, కసాయివాడు దానిని నరకటానికి తీసుకెళ్తుంటే వీడు నన్ను పెంచుకోవటానికి తీసుకెళ్తున్నాడు ఎంత మంచివాడనుకుంటుంది. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! గొర్రెల్లాంటి అమాయకులకు నీవే దిక్కు.

**ఆ॥ కుంతి 'మాటదాచి' కొడుకును కోల్పోయె**
**కైకమాట జారి కాంత బాసె కాల్చె కొంప**
**తుదకు హాని కలుగు తొందర పాటుతో**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 59



తా॥ ఏ పని అయినా మంచి చెడ్డా ఆలోచించి చేయాలి. తొందరపాటు వల్ల చివరికి హానే జరుగుతుంది. కుంతీదేవి కర్ణుడు సూర్య భగవానుడి వల్ల తనకి కలిగిన బిడ్డని చెప్పివుంటే ధర్మజుడు అతనినే చక్రవర్తిని చేసేవాడు. యుద్ధం జరిగి జననష్టం జరిగేది కాదు. కైక మాట జారి కోరరాని కోరిక కోరి రాముని వనికి పంపి భర్త దశరధునే పోగొట్టుకుంది. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! మాకు ఋజు ప్రవర్తన ఇమ్ము తండ్రీ.

**ఆ॥ కంఠమందు బడునె? కల్కి వడ్డాణంబు**
**వేలి వుంగరమ్ము కాలికగునె?**
**ఏది ఎచట తగునొ ఎరిగి చేయుట ఒప్పు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 60



తా॥ ఒక భామ అలంకరణలోనే ఎన్నో పద్ధతులుంటాయి. ఆ పద్ధతి అమలు జేయకపోతే అలంకారం కాస్తా వికారం అవుతుంది. ఆమె నడుముకి పెట్టుకునే వడ్డాణం ఆమె కంఠసీమలో వుంటే ఎంత అపహాస్యంగా ఉంటుంది. అలాగే వేలి ఉంగరం కాలికి సరిపోతుందా ఏది ఎచ్చట సరిపోతుందో అది అక్కడ అమరితే ఒప్పు. కానీ అపసవ్యంగా చేస్తే అసహ్యంగా వుంటుంది. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! సరిలేరు నీకెవ్వరు.

**ఆ॥ గొల్ల పిల్లగాండ్ల కూడి చద్దులు తిని**
**'కుబ్జ' కోర్కెదీర కూడి రతిని**
**పావనంబు చేసె పరమాత్మ అందరిన్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 61

తా॥ గొల్లపిల్ల గాళ్ళు ఆవుల్ని మేపటానికి వెళ్ళేప్పుడు చద్ది అన్నం మూటగట్టుకుని వెళ్ళి ఆవుల్ని మధ్యాహ్నందాకా మేపి అవి విశ్రాంతి తీసుకుంటున్నపుడు, తమ మూటలు విప్పి అంతా కలిసి తిని ఆడుకుంటారు. శ్రీకృష్ణుడు కూడా రేపల్లెలో గొల్ల పిల్లలతో కలిసి అలాగే చేశాడు. కుబ్జ అనే పరమ కురూపియై అష్టవంకరలున్న పూలమ్మే దానిని, మధురకు వచ్చినప్పుడు తన పాదాలతో దాని పాదాలు తొక్కిపట్టి సాగదీసి వంకరలు సవరించటమే కాక, కౌగలించి సౌందర్యవతిని చేశాడు. ఇదంతా తనకు పూమాల లిచ్చిందని. పరమాత్ముడైన ఆ వేంకటాద్రి వాసుడు వేంకటేశుడు భక్తులు అందరినీ పావనం చేశాడు.



**ఆ॥ వైజయంతి మెడను విలసిల్లె మాలయై,**
**కౌస్తుభమ్ము వక్షకాంతిపెంచె,**
**పుట్టుమచ్చ పేరుపొందె శ్రీవత్సమై**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 62

తా॥ స్వామి మెడలో కాంతులు విరజిమ్ముతున్న పూలదండ పేరు వైజయంతీ మాల. ఆయన వక్ష స్థలంపై మెరుస్తుండే దివ్యమణి పేరు కౌస్తుభ మణి. ఆయన వీపుపై ఉండే పుట్టు మచ్చపేరు శ్రీవత్సము. ఇవన్నీ ఆయన ఒక్కడికే స్వంతం. అట్టి ఓ వేంకటేశా! వేంకటాద్రి వాసా! నీవు దివ్య లక్షణ శోభితుడవు ప్రభూ!

**ఆ॥ అయ్యతోటి 'బోరు' అమ్మతో 'పోబోరు'**
**ఆలితోటి 'బోరు' అవని వీడి**
**అయ్యొ! ప్రేమలన్ని అద్దాన నగలయా**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 63



తా॥ ఎంత ప్రేమించినా తన తండ్రితోగాని, తల్లితోగాని ఆఖరికి భార్యతో గాని ఎవ్వరూ చనిపోరు. ఈ ప్రపంచాన్ని వదిలి వేయలేరు. మరి ఈ ప్రేమలూ, మమకారాలూ అన్నీ ఏమిటి? అద్దంలో కనబడే నగలు. చూడటానికి బాగుంటాయి కాని అక్కరకు రావు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! ఇది పరమ సత్యం.

**ఆ॥ నిండు గర్భవతిని నిందపాల్జేసిరి**
**అడవికంపిరయ్యొ! అవని సుతను**
**కానిరోజులందు కష్టాలు బలమౌను**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 64

తా॥ దైవం అనుకూలించని, కాని రోజులు వస్తే ఎవ్వరికైనా కష్టాలు తప్పవు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశ్వరా! ఆనాడు నిండు గర్భవతియైన సీతను అనరాని మాటలని అడవులకి పంపించి వేశారయోధ్యలోని



అనామకులు. అయోనిజపైనే అపవాదు వచ్చింది. ఇక మేమెంత?

**ఆ॥ ఏకలవ్యు వ్రేలినిమ్మనె ద్రోణుండు,**
**భార్గవుండు కర్ణు వ్యర్థుచేసె**
**కులము కారణమున కలిగెను ద్వేషమ్ము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 65

తా॥ అగ్ర కులాల వారికీ అన్య కులాల వారికీ కులద్వేషం అనాదిగా వస్తున్న జాడ్యం. ఈ కుల ద్వేషం ద్వాపర యుగాంతంలో నరమేధం సృష్టించింది. ఎరుకలవాడైన ఏకలవ్యుడు అర్జునుని కంటే మేటి విలుకాడు కాకూడదని, ద్రోణుడు అతని కుడిచేతి బొటనవేలినే గురుదక్షిణ కోరి అతని భవిష్యత్తు నాశనం చేశాడు. పరశురాముడు తన

శిష్యుడు కర్ణుడు సూత పుత్రుడని తెలియగానే నాకు అబద్ధం చెప్పావా అని బ్రహ్మాస్త్రం దక్కకుండా చేశాడు. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఎంత అన్యాయం.

**ఆ॥ రాజు కొడుకు వచ్చు గజముపై వూరేగి**
**పడుపుకత్తె కొడుకు పడకలేయు**
**ఏది ఎవడు చేయు ఎరుగు నీవొకడవే**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 66

తా॥ పూర్వ జన్మ కర్మల ఫలంగా జన్మలు వాటిలో ఒడుదుడుకులూ కలుగుతాయి. ఆ విధి విధానంలో ఎవరు ఏమవుతారో తెలియదు. రాజుకి పుట్టినవాడు ఏనుగు అంబారీపై వూరేగి వస్తాడు. శరీరాన్ని వెలకమ్ముకునే స్త్రీకి పుట్టినవాడు తార్పుడు వానిగానే జీవితం గడుపుతాడు. అయితే విధి విధానంలో వీళ్ళు వ్యక్తులయ్యాక కూడా ఇటువంటి జీవితమే



గడుపుతారని ఏ నియమమూ లేదు. వేంకటాద్రి వాసుడవైన వేంకటేశా! అంతా నీలీల.

**ఆ॥ 'ఏనుగు' మొరవెట్ట వెనువెంట గాచావు**
**దేవతలకు బాధ దీర్చినావు**
**సర్వులకును రక్ష శౌరి! నీవేనయ్య**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 67

తా॥ గజేంద్రుడు, మొసలికి చిక్కి మొరపెట్టుకుంటే ఉరుకులు పరుగులపై వెళ్ళి మొసలిని చక్రంతో ఖండించి ఆ ఏనుగును కాపాడాడు శ్రీహరి. దేవతలు రాక్షసుల బాధపడలేక విచారిస్తుంటే ఎన్నోసార్లు వాళ్ళని కాపాడాడు. అందరికీ రక్షకుడు విష్ణుమూర్తి అయిన నీవే కదా. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! పాహిమాం పాహిమాం.



**ఆ॥ పేడి అయ్యు నాడు పేరొందె పార్థుండు**
**సవితు సారధయ్యె అవిటివాడు**
**అవిటితనము కూడ అవకాశమై తీరు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 68

తా॥ ఊర్వశి శాపం వల్ల పేడిగా మారిన అర్జునుడు తన నాట్య విద్యా ప్రావీణ్యాన్ని విరటుని ఆశ్రయం పొందటానికి ఉపయోగించుకొని రాకుమారి ఉత్తరకు నృత్యం నేర్పి అజ్ఞాతవాసకాలం దిగ్విజయంగా పూర్తి చేశాడు. కాళ్ళు లేని అనూరుడు చాలా వేగంగా రధ చోదనా కౌశల్యం వల్ల సూర్య భగవానునికే రధ సారధయ్యాడు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! ఒక్కొక్కప్పుడు అవిటితనము కూడా మనిషిని ఆదుకుంటుంది.



**ఆ॥ బాధ తాళలేక 'వంకర' యోచించి**
**ఆత్మహత్య చేత అంతమొంద**
**ప్రేతరూపమొందు పెరుగును బాధలు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 69

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! మానవులకు సుఖ దుఃఖాలు వారు చేసిన పాప పుణ్యాల ఫలితంగా నీచేత నిర్ణయించబడి కొన్ని ఇప్పుడే ఇక్కడే అనుభవించటానికి, కొన్ని ఈ శరీరం వదిలి యాతనా శరీరం ధరించిన జీవుడు అనుభవించటానికి, కొన్ని మరుజన్మలో అనుభవించటానికి నిర్దేశింపబడతాయి. ఈ జన్మల చక్రాన్ని తప్పించగలిగిన వాడివి నీవొక్కడివే. నీ శరణాగతి పొందాలిగాని, అతి తెలివితో వక్రమైన ఆలోచనతో బాధ తప్పించుకోవటానికి ఆత్మహత్య చేసుకుంటే ఏమీ లాభం లేదు సరికదా ప్రేతాత్మ అయి అసలు శిక్షా

సమయం పెరుగుతుంది. (శ్రీ రాఘవేంద్ర స్వామి ఈ విషయం నిరూపించారు) కనుక ఈ తప్పుడు ఆలోచనలు రాకుండా మమ్మల్ని కాపాడు. శరణు.

ఆ॥ **దశరథుండు మునిని దయతల్పమని వేడి**
**రాముపంపనంచు రభసచేసె**
**కడుపుతీపి కొరకు ఘనుడు దీనుండయ్యె**
**వేంకటాద్రివాస వేంకటేశ** 70

తా॥ విశ్వామిత్రుడంతటివాడు తనదగ్గిరకు సహాయం కోరి వచ్చాడని సంతోషమూ భయమూ కలిగాయి దశరథుడికి. ఏం చేయమంటారో చెప్పండి స్వామీ! మీ ఆజ్ఞ శిరసావహిస్తానని మాట ఇచ్చాడు. నా యజ్ఞం చెడిపోకుండా కాపాడుటకు నీపుత్రుడు రాముడిని నాతో పంపించమన్నాడు కౌశికుడు. గొంతులో వెలక్కాయ పడినట్లయింది రాజుకి. నేను



వస్తాను రాముడు చిన్నపిల్లవాడు అని మొరాయించాడు, దయ తలచి రాముని బదులు తనని తీసుకు పొమ్మని వేడుకున్నాడు. అంతటి మహాచక్రవర్తి, తన కడుపు తీపికోసం, అంటే కన్నబిడ్డకి కష్టం రాకూడదని దీనుడై కాళ్ళా వేళ్ళా బడ్డాడు. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఎంత విచిత్రం.

ఆ॥ **ఇంటినద్దెకిచ్చు, ఇంతిని వెలకిచ్చు**
**తనను అమ్ముకొనును ధనము కొఱకు**
**ఇంతచేసి తాను ఎప్పుడూ దుఃఖించు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 71

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! మనిషి ఎన్ని, 'ఘనకార్యాలు' చేస్తున్నాడో చూడు ప్రభూ! డబ్బు



డబ్బు అనే వ్యసనంతో తను సుఖంగా నివసించటానికి కట్టుకున్న ఇంటిని అద్దెకిస్తున్నాడు ఒకడు. తన భార్య ద్వారా డబ్బు ఇంకా ఎక్కువ గడించాలని చూస్తున్నాడు ఇంకో బేహారి. మరొకడు తనని తనే అమ్ముకుని బానిస జీవితం గడుపుతున్నాడు. ఇవన్నీ ధనం కోసం చేస్తున్నాడు. అయితే ఇంతా చేసి తను సంతోషం అనేది ఎరుగక దుఃఖిస్తూనే ఉంటాడు.

ఆ॥ **మత్స్యమయ్యె హరియె మట్టుబెట్టెను నాడు**
**సోమకాసురుడిని సొంపుమీర**
**వెలికితీసి కాచె వేదాలనానాడు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 72

తా॥ సోమకాసురుడనేవాడు వేదాలను సముద్రంలో దాచి నిర్మూలించాలని చూస్తే శ్రీహరి మత్స్యావతారమెత్తి, పెద్ద చేప రూపంలో వాడిని సంహరించి ఆ వేదాలను



బయటకు తీసి ప్రపంచాన్ని ఉద్ధరించాడు. అట్టి శ్రీమన్నారాయణుడవైన ఓ వేంకటేశ్వరా! నీవు అనాథ రక్షకుడవు.

ఆ॥ **కుమ్మరొకడు గాంచె గురియుంచి మాధవున్**
**తురక రాజు గాంచె హరిని నాడు**
**కులము లెక్కకాదు కూడంగ నీశ్వరున్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 73

తా॥ కుమ్మరి గోరాకుంభార్ అనే భక్తుడు పాండురంగని కొలిచేవాడు. భక్తితో పాడుతూ కుండకు కావలసిన బంకమన్ను మెత్తగా తొక్కుతూ నృత్యం చేసేవాడు. అతను భక్తి పారవశ్యంలో మట్టి తొక్కుతూ చూసుకోకుండా తన చిన్నారి కొడుకుని కూడా మట్టితో పాటు తొక్కేశాడు. అంత భక్తి అసామాన్యం కదా. పాండురంగడు తనే దిగివచ్చి ఆ పిల్లవాడిని

బ్రతికించాడు. తురక రాజైన తానీషా గోలకొండ నవాబు. రామదాసు ప్రభుత్వ ధనం భద్రాచల రామాలయ నిర్మాణానికి ఉపయోగించాడు. కారాగారంలో బంధింపబడి రాముని దయకోసం ఆక్రోశించాడు. రాముడు లక్ష్మణునితో తానీషాకు కనిపించి రామదాసు వాడిన ధనం చెల్లించి తన భక్తుని విడిపించాడు. వేంకటాద్రివాసా! వేంకటేశా! నీదయ పొందాలంటే కుల మతములతో పనిలేదు. నీపై అచంచల భక్తి ఉంటే చాలు.

**ఆ॥ బ్రతుకు బాధలన్ని పరమాత్మ శిక్షలౌ**
**శిక్ష అనుభవించ శ్రేయమగును**
**నీదు శిక్ష మాన్ప నెగడునే ఏరికిన్?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 74



తా॥ ప్రభూ వేంకటాద్రి వాసా! వేంకటేశా! మా బ్రతుకుల్లో కలిగే బాధలన్నీ పరమాత్మ విధించిన శిక్షలే. ఆ శిక్ష అనుభవించటం మంచిది. నీ శిక్ష మాన్పించే శక్తి ఎవరికన్నా ఉంటుందా? ఉండదు. ఆ శిక్ష అనుభవించే స్థైర్యం, నీమీదే నిలిచే మనస్సు ఇస్తే చాలు నాకు.

**ఆ॥ శివుని మెప్పు పొందు రావణునైనను**
**శూర్పణఖయె చెరచె 'చుప్పనాతి'**
**కుండపాలు విరిచె గుప్పెడు లవణమ్ము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 75

తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! పరమ శివుని మెప్పు పొందిన రావణాసురుని చుప్పనాతి శూర్పణఖ దుర్బోధ చేసి సీతాపహరణం చేయమని చెప్పి చెడగొట్టింది. కుండ పాలు విరిగి పోవటానికి గుప్పెడు ఉప్పు చాలు. ఆ విధంగానే బ్రహ్మనైనా స్త్రీ దుర్బోధ చెడగొట్ట కలదు.



**ఆ॥ శల్యుడెగ్గు చేసె చంపించ కర్ణునిన్**
**రధము నడుపదాయె లావు బెంచి**
**ఇంటిదొంగ దొరకడీశ్వరుకైననున్**
**వేంకటాద్రివాస వెంకటేశ!** 76

తా॥ భారత యుద్ధంలో కర్ణునిమీద ఆశలు పెట్టుకున్న రారాజు అతనికి సారధిగా శల్యుడిని నియోగించాడు. శల్యుడు మంచి రధ సారధే కాని నకుల, సహదేవుల మేనమామ. వంచనతో ఆయన్ని తమవైపు త్రిప్పుకున్నాడు రారాజు. ఇచ్చిన మాట ప్రకారం ఆ మహా ధీరుడు, రారాజు పక్షాన యుద్ధం చేసినా తనకి జరిగిన మోసాన్ని మోసంతోనే ఎదుర్కున్నాడు. శల్య సారధ్యంగా పేరు పొందిన రధ సారధ్యం చేసి కర్ణుని చావుకి కారణం అయ్యాడు. కర్ణా! నీవు అర్జునుడిని గెలువలేవు ఎందుకు అనవసరమైన శ్రమ.



పారిపోదాం. రధం వెనక్కి తిప్పనా అని ఈసడించేవాడు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! అందుకే ఇంటిదొంగ ఈశ్వరుడికైనా దొరకడంటారు.

**ఆ॥ విల్లు వీడుశరము ఇల్లు వీడిన నాతి**
**మరణమొందినట్టి మానవుండు**
**మంటగలియుగాని మరలి రా జూచిరే**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 77

తా॥ ఒక విల్లు నుంచి విడిచిపెట్టబడిన బాణం (యుద్ధంలో) ఇల్లు విడిచిపెట్టి (అన్యులతో) పోయిన స్త్రీ, మరణించిన మనిషి మంటలో కలిసిపోతారు. (ఆస్తికత కోల్పోతారు) మరల తిరిగి రావడం అనేది జరగదు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! ఇది ఇంతే.

ఆ॥ **నీకు తనువులిచ్చి నిన్ను పొందిరి స్త్రీలు**
**కాంచిరసురులెల్ల కత్తిగట్టి**
**నిన్ను చేరు దారులెన్నియో పరమాత్మ**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 78

తా॥ వనితలు నీవే సర్వస్వం అని నీకు తమని అర్పించుకొని నిన్ను పొందారు. రాక్షసులుకూడా వాళ్ళ మనోభావాలకి తగ్గట్లు నిన్ను శత్రువుగా భావించి అనుక్షణం నిన్నే తలుచుకుంటూ వారు కూడా నిన్ను పొందారు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! పరమాత్మా! నిన్ను చేరేదారులు అనేకం.

ఆ॥ **శిక్షయంచు జగతి శిక్షవేరుండునే!**
**జీవితంబు ఒక్క శిక్ష కాదె?**
**శిక్షయంచు తెలియ చేయక శిక్షించు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 79



తా॥ ఈ ప్రపంచంలో శిక్ష అని వేరే ఏదీ లేదు. మానవ జీవితం ఒక శిక్ష కాదా? అది శిక్షే. మనిషికి ఆ శిక్ష అనుభవిస్తున్నప్పుడు, అది శిక్ష అనికూడా తెలియకుండానే అనుభవించేస్తుంటాడు. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఇది నిజం.

ఆ॥ **మాట వినక కోరె మహిపుత్రి మృగమును**
**చిత్తక్షోభ ప్రభువు చెంది వగచె**
**చెడ్డకాలమందు చెడు యోచనొచ్చును**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 80

తా॥ బంగారు లేడిని చూచి పరవశించి సీత అది కావాలని తెచ్చిస్తె ఆడుకుంటానని రామునితో అంది. అది రాక్షస మాయ అని లక్ష్మణుడు నెత్తి నోరు కొట్టుకొని చెప్పినా వినక రాముని ఆ లేడికోసం పంపింది.



దానికి పర్యవసానంగా రామచంద్రుడు కూడా ఎంతో వేదన అనుభవించాడు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! చెడ్డకాలం దాపురించిన వారికి చెడు ఆలోచనలొస్తాయి.

ఆ॥ **అలిగి ద్రోణుపైన అర్జునుడానాడు**
**ఏకలవ్య వేలికెసరు పెట్టె**
**ఆడలేనియమ్మ 'ఓడు' మద్దెల అనున్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 81

తా॥ నిన్ను మించిన విలుకాడు ఉండడని ద్రోణునిచే మాట తీసుకున్నాడు అర్జునుడు. కాని ఏకలవ్యుడు ద్రోణుని గురువుగా పూజించి తన స్వయం శక్తితో విలుకాడై అర్జునునికి తనేమీ తీసిపోనని నిరూపించాడు. అర్జునుడు ద్రోణునిపై అలిగాడు. ద్రోణుడు ఏకలవ్యుని కలిసి విషయం తెలుసుకుని తనకు గురుదక్షిణగా బొటనవ్రేలు నిమ్మని అడిగి ఆ వేలు కోయించి అతను



విలు విద్యకు పనికి రాకుండా చేశాడు. నర్తకి ఒకామె సరిగా నాట్యం చేయటం లేదేమని అడిగితే మద్దెల ఓటిది సరిగా శబ్దం వినపడక నృత్యం సరిగా కుదరడం లేదు అందట. వేంకటాద్రివాసా! వేంకటేశా! ఏం విడ్డూరం!

ఆ॥ **కనెను ఒక్క సుదతి కదలని బిడ్డను**
**అవక కాన్పు ఒకతె యమునిజేరె**
**కోటిరూకలుండి కుదరదు దయలేక**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 82

తా॥ ఒక స్త్రీకి కాన్పు అయి ప్రాణం లేని (కదలని) బిడ్డను ప్రసవిస్తుంది. ఇంకొకతె కాన్పు కాక చనిపోతుంది. వీళ్ళంతా కోటీశ్వరుల భార్యలయి వుండవచ్చు. కాని ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! నీకృపలేకపోతే ఈ ఐశ్వర్యం వాళ్ళనేమాత్రం కాపాడలేదు. బ్రతికి బట్ట కట్టాలంటే మనిషికి కావలసింది నీదయ.

ఆ॥ నీలిమేఘమంటి జలజాక్షు జుట్టిరి
మెఱుపు తీగలంటి తరుణులెల్ల
భ్రమసి మెరుపులంచు నెమలి పింఛము విప్పె
వేంకటాద్రివాస వేంకటేశ! 83

తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! నీలి మేఘంలాంటి శ్రీకృష్ణుడు అరవింద దళాక్షుడు. ఆయనను మోహావేశంలో తళుక్కుమని మెరిసే మెరుపు తీగెల్లాంటి గోపికలు కౌగలించి రకరకాలుగా ఆయనను పెనవేసుకోటానికి ప్రయత్నిస్తున్నారు. నల్లటి కారు మబ్బుపట్టి తళుక్కుమనే మెరుపు తీగెల్లా కనిపిస్తున్నారు. ఆ దృశ్యం చూసి మబ్బులు పట్టి వాన వస్తుందేమో ఆకాశం మెరుస్తున్నదేమో అని నెమలి భ్రమపడి తన పింఛం విప్పి ఆడింది. జగత్తు పరవశించింది.



ఆ॥ అక్షుదెత్తివచ్చి హనుమచే హతుడయ్యె
సైంధవుండు జచ్చె సైపలేక
చావు పిలుచుచుండ సాధ్యమా తప్పింప
వేంకటాద్రివాస వేంకటేశ! 84

తా॥ అక్షుడు రావణాసురుని కొడుకు. అశోకవనం పాడుచేస్తున్న కోతిని పట్టుకుందామని వచ్చి దుర్భాషలాడి హనుమంతునితో యుద్ధంచేసి మరణించాడు. సైంధవుణ్ణి కాపాడుదామని ద్రోణ, నేతృత్వంలో కౌరవసేన ప్రయత్నించినప్పటికీ ప్రాయోపవేశం చేసే అర్జునుడు ఎలా చనిపోతాడో చూద్దామనే వెర్రి కోరికతో ద్రోణుడి రక్షణలోంచి బయటకు వచ్చి పార్థ సారథి ఆదేశంతో పార్థుని చేతిలో చచ్చాడు. వేంకటాద్రి వాసుడవైన వేంకటేశా! మానవులు దుష్ప్రవర్తన వల్ల కోరి చెడిపోయారు. చావు రారమ్మని మృత్యు దేవత రూపంలో పిలుస్తుంటే దాన్ని తప్పించటం సాధ్యమవుతుందా? కాదు.



ఆ॥ కోట్లు కూడబెట్టి గొప్ప మేడలు కట్టి
విడిచి పోవునన్ని 'గడప' లోనె
మూడునాళ్ళు జరుగు ముచ్చటలన్నియు
వేంకటాద్రివాస వేంకటేశ! 85

తా॥ మనిషి కోట్ల కొద్దీ ధనం కూడబెట్టినా, గొప్ప గొప్ప భవంతులు కట్టించినా చనిపోయాక అన్నీ గడపలోనే విడిచిపెట్టి పోతాడు. మనిషి జీవితంలో జరిగే ముచ్చట్లన్నీ (వైభవాలన్నీ) మూడు నాళ్ళవే. ఏదీ శాశ్వతం కాదు. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! ఎంత విచిత్రం.

ఆ॥ వేటచేసె హాని వెనుక దశరథుకున్
పాడుచేసె వేట పాండునృపుని
వ్యసనమొకటె చాలు వసుధలో చెడగొట్ట
వేంకటాద్రివాస వేంకటేశ! 86



తా॥ క్రూర జంతువులు జనవాసాలపై బడి ప్రాణ నష్టం చేస్తుంటే రాజులు వేటకు వెళ్ళి వాటిని చంపి, ప్రజల్ని కాపాడేవారు. క్రూర జంతువుని గెలిచామనే గర్వం, ఆనందం ఆ ప్రజాహిత కార్యాన్ని వారికి వ్యసనంగా మార్చింది. వ్యసనం మానుకోవటం చాలా కష్టం. అది హానికరం. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! దశరథ మహారాజు వేటలో పొరబాటున ముని కుమారుణ్ణి చంపి వాని గ్రుడ్డి తల్లిదండ్రుల శాపంతో కొడుకు కోసం ఏడుస్తూ చచ్చిపోయాడు. పాండురాజు కూడా వేటవలన శాపగ్రస్తుడై స్త్రీ సుఖం పొందితే మరణిస్తావనే శాపంతో భార్యలని తాకలేక చివరికి భార్య మాద్రి మూలంగానే మరణించాడు.

ఆ॥ క్రీడి గెల్చువాడు వీడని పేరొంది
అపుడె కర్ణుడయ్యె అంగరాజు
తాడితన్నువాని తలదన్నువాడుండు
వేంకటాద్రివాస వేంకటేశ! 87

తా॥ అస్త్ర విద్యా ప్రదర్శనా సమారోహంలో వారి వారి విద్యా కౌశలాన్ని చూపిస్తున్నారు యువకులు. అర్జునుని ప్రావీణ్యం చూసి ప్రశంసలు వెల్లువయ్యాయి. అప్పుడు 'అగ్రకులాలకు చెందని రధసారధి పుత్రుడు కర్ణుడు తన అస్త్ర విద్యను చూపించి ఒహో! ఇతను పార్థుని కన్నా గొప్ప విలుకాడని పించుకున్నాడు. వీడికి అర్జునుడితో పోటీ ఏమిటన్నారు 'పెద్దలు'. వెంటనే దుర్యోధనుడు కర్ణుని సమర్థించి అతనిని అంగ రాజ్యానికి రాజుని చేసి ఇప్పుడేమంటారు? అన్నాడు. అందుకని ఎవ్వరూ నేనే గొప్పవాడినని గర్వించరాదు. తాటిచెట్టు ఒకడెక్కగలిగితే అంతకంటే ఎత్తు ఉన్న చెట్టును అంతకన్నా తక్కువ సమయంలో ఎక్కేవాడు (తలదన్నేవాడు) ఉంటాడు. వేంకటాద్రివాసా, వేంకటేశా! ఇది సత్యం.



**ఆ॥ ఒక్కరాయి పూజలొందును దేవుడై**
**పదము క్రింద త్రొక్కబడును ఒకటి**
**ఎవరికేది తగునొ ఎరుగును శౌరియే**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 88

తా॥ ఎక్కడో కొండల్లో దొరికిన ఒక శిల గొప్ప శిల్పిచేత చెక్కబడి గొప్ప శిల్పం అయి, గొప్ప ఆలయంలో ప్రతిష్ఠించబడి నిత్య పూజలు పొందుతుంది. దాని ప్రక్కనే వున్న ఇంకో రాయి ఆ గుడిమెట్లలో ఒకమెట్టు అయి వచ్చి పోయే వాళ్ళ కాళ్ళక్రింద త్రొక్కబడుతోంది. ఇలా ఎందుకు జరుగుతున్నది? వేంకటాద్రివాసుడవైనన ఓ వేంకటేశా! ఎవరికి ఏది ఇవ్వాలో నిర్ణయించి ఇచ్చే భాగ్య ప్రదాత నీవే కాబట్టి మా చేతుల్లో ఏమీ లేదు ప్రభూ!



**ఆ॥ 'మోళిగాడు' అనిరి మోసగాడన్నారు**
**స్త్రీకి 'అంగలార్చు' చెనటివనిరి**
**చెడుకు మంచికైన చిరునవ్వె నీమాట**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 89

తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! నీలీలలు అవగతం కావు. నీ కృష్ణావతారంలో నీమీద వైరి భావం ఉన్న దుష్టులు నిన్ను అనరాని మాటలు అన్నారు. కొందరు శిశుపాలుడి వంటి వారు గారడీలు చేసే మోళిగాడు అన్నారు. కొందరు కుతంత్రాలు పన్నే మోసగాడి వన్నారు. రుక్మి లాంటి వీళ్ళ సంఖ్య కంతులేదు. కొందరు కంసుడు వంటి నీచులు నిన్ను స్త్రీ వ్యసనం ఉన్న అధముడి వన్నారు. వాళ్ళందరికీ నీ జవాబు మాత్రం మనోహరమైన చిరునవ్వు. ఎవరిమీదా నీకు మాత్రం పగ ఉండదు.



**ఆ॥ శిష్టరక్షణమ్ము చేయ నీ వ్రతమయ్య**
**దుష్ట జనుల నెల్ల దునుమ నీవు**
**యుగములన్నిటందు యుర్విజనింతువు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 90

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! శిష్టరక్షణము అనగా మంచివారని కాపాడుట మరియు దుష్ట జనులను సంహరించుటకు నీవు యుగాలన్నిటిలోనూ భూలోకంలో జన్మించి నీమాట నిలబెట్టుకుంటున్నావు.

**ఆ॥ వీరు వారనంచు బేధమ్ములేకయే**
**పొందిరెల్ల దయను పుడమియందు**
**ఎంతమంది త్రాగి, ఏమౌను గంగకు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 91

తా॥ వీళ్ళూ వాళ్ళూ అనే తేడా లేకుండా ఈ ప్రపంచంలో సమస్త జీవులు నిన్ను శరణనగానే నీదయపొందారు. అశ్వద్ధ వృక్షము నేనే కిరీటి! అని శ్రీకృష్ణుడు తన విభూతిని వివరిస్తూ భగవద్గీతలో "లేదు జగతినేది లేక నేను" అన్నాడు ఆ పరమాత్మ. ఎన్నో పురాణాల వల్ల ఈ విషయం తెలుస్తూనే వుంది. గంగానది అనంత జలరాశి. అది మనుష్యులు దాహం తీర్చుకోవటానికి త్రాగితే ఎండిపోతుందా? వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! నీ దయా వారాహి ఎంతమంది దప్పిక తీర్చుకున్నా ఎండిపోదు ప్రభూ!

**ఆ॥ దశరథుండు వగచె దాసి మంథర వల్ల**
**సర్వ జగతి వగచె శకుని వల్ల**
**ధాన్యమందు పురుగు దాని నాశనకారి**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 92



తా॥ దశరథ మహారాజు దాసి మంథర కైకకు చేసిన దుర్బోధవల్ల రామవనవాసం తప్పదని తెలిసి రామా! అని దుఃఖిస్తూనే మరణించాడు. శకుని కపట జూదం వల్ల పాండవ కౌరవుల వైరం కురుక్షేత్ర యుద్ధానికి దారితీసి రాజులంతా నశించి జననష్టం జరిగి సర్వ జగతీ బాధ పడింది. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! ధాన్యానికి పురుగు పడితే క్రమంగా ధాన్యమంతా పాడుచేస్తుంది.

**ఆ॥ విశ్వరూపు జూపి భీష్ముని బ్రోచియున్**
**చక్రమెత్తి వాని చంపబూని,**
**మాటతప్పలేక మన్నించి వదిలావు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 93

తా॥ ఎవ్వరికైనా చూడటానికి అసాధ్యమైన అద్భుతమైన నీ విశ్వరూప దర్శన భాగ్యం ఆ భీష్మునికి



ప్రసాదించావు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు నీ చేతిలో చనిపోయి మోక్షం సంపాదించాలన్న ఆశతో పదునైన బాణాలు నీమీద వేసి నిన్ను బాధిస్తుంటే ఆయనని అర్జునుడు నిరోధించలేక పోయాడు. కోపం తట్టుకోలేని శ్రీకృష్ణుడు చక్రం చేపట్టి ఇక ఆగను ఈయన తల నరుకుతానని సిద్ధపడ్డాడు. అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుని పాదాలపై బడి 'మన్నింపు నాలావు నగుబాటు సేయకు' అని అని వేడుకున్నాడు. ఇక ఇచ్చినమాట కాదనలేక క్షమించి వదిలి పెట్టాడు స్వామి. ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! నీ లీలలు అద్భుతం.

**ఆ॥ వేణుగాన రవళి విన్న గోపికలెల్ల**
**తమ్ము మరచినారు తన్మయమున**
**చెప్పవీలుకాదు చిన్మయానందము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 94



తా॥ వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! నీ కృష్ణావతారంలో మధురమైన నీ వేణుగానం విన్న గోపికలు అందరూ తన్మయత్వంతో తమని తామే మరచిపోయారు. మాటలతో వర్ణించుటకు సాధ్యం కాని చిన్మయానందంలో మునిగి పోయారు. ఎంత అదృష్టవంతులు!

**ఆ॥ ఆలికోక జుట్టె ఆనాడు నలరాజు**
**పనిగ భిక్షులైరి పాండుసుతులు**
**కర్మకాలినంత కడగండ్లు తప్పవు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 95

తా॥ ఘనులైన చక్రవర్తులలో ఒకడుగా పరిగణింపబడే నలమహారాజు కలి పురుషుని చేత పీడించబడి రాజ్యం కోల్పోయి అష్టకష్టాల పాలయి అడవుల్లో గడుపుతూ ఆహారం కోసం కొన్ని పావురాలపై తను కట్టుకున్న గుడ్డ విప్పి వాటిపై వేస్తే విధి వ్రాత అన్నట్లు ఆ

పావురాలు ఆయన పంచెని కూడా ఎత్తుకొని ఎగిరిపోయాయి. భార్య దమయంతి చీర సగం చించి ఇచ్చింది. అంత కంటే కష్టం ఉంటుందా! మహా పరాక్రమవంతులు పాండవులు ఏక చక్రపురంలో భిక్షం ఎత్తారు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! కర్మకాలిపోతే అంటే విధి వక్రిస్తె కష్టాలు కన్నీళ్ళు తప్పవు.

ఆ॥ **నవ్వుతున్న వేళ 'నటనతో' నిను వేడు**
**ఏడ్చునపుడు తిట్టు హీనగతిని**
**మనిషి నీచుడయ్యు మాధవా! కరుణించు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 96

తా॥ ఓ మాధవా! మనిషి ఎంత నీచుడయ్యా! తను సంతోషంగా ఉన్నప్పుడు నిన్ను వేడుకోవటం 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' అని కూడా



నటిస్తూనే అంటాడు. ఇక ఏడ్చేటప్పుడు సరేసరి. దుమ్మెత్తిపోస్తాడు. నీవు క్రూరుడివి దయాహీనుడవు అని నిందిస్తాడు. కానీ ఓ వెంకటేశా! వేంకటాద్రివాసా! నీవే కరుణించక పోతే వాడికి దిక్కేది? నీకు తప్పదు. కరుణించు స్వామీ!

ఆ॥ **కాకి కిచ్చు శిక్ష చేకొని లంకేశు**
**కీయలేవ నీవు, ఏమి వింత!**
**నటనసూత్రధారి నాయనా! నీలీల**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 97

తా॥ నటనతో త్రిజగంబులనూ పరవశించి మాయలో పడేట్లు చేసే ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఆనాడు ఇంద్రుడి కొడుకు కాకి రూపంలో వచ్చి, సీత ఒడిలో తలవుంచి నిద్రిస్తున్న రాముని కోసం సీత బాధ ఓర్చుకుంటుంటే ఆమెని ముక్కుతో పొడిచి రక్తం



వచ్చేట్లు చేశాడు. రక్త స్పర్శకి నిద్రలేచి రాముడు కోపం పట్టలేక ఒక దర్భ పుల్లని బ్రహ్మాస్త్ర మంత్రం పఠించి ఆ కాకిమీద వేశాడు. ముల్లోకాధిపతులూ ఆ కాకిని కాపాడుట మావల్ల కాదన్నారు. రాముని కాళ్ళపై బడి తప్పు క్షమించమని వేడుకుంటే బ్రహ్మాస్త్రానికి దాని ఒక్క కన్ను మాత్రం శిక్షగా తీసుకుని వదిలాడు రాముడు. అట్లాంటిది రావణుని చంపటానికి అంత కష్టపడాలా? ఎంత చిత్రం!

ఆ॥ **మేనమామనంచు తనప్రేమ జూపించి**
**మాయచేసి శకుని మట్టుపెట్టె**
**పండునున్న పురుగు పైకి జూపట్టునా?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 98

తా॥ తినే పండుకి పురుగు పట్టినప్పుడు అది పైకి కనిపించదు లోపలి లోపల నుంచే డొల్లచేసి



తినేస్తుంటుంది. పండు పైకి బాగానే కనిపించినా లోపల కుళ్ళిపోయి వుంటుంది. అందుకే పైకి మంచిగా కనిపించే వన్నీ మంచివనుకోరాదు. ఆనాడు శకుని చాలా ప్రేమగల మేనమామగా ప్రేమ ఒలకబోసి మాయా జూదంలో పాండవుల రాజ్యం గెలిపించి పైకి మంచి చేసినట్లు కనిపించి సర్వ నాశనం చేశాడు. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! గోముఖ వ్యాఘ్రాల నుంచి మమ్ము కాపాడు.

ఆ॥ **వేదఘోష జేత విలసిల్లు గృహమందు**
**మనిషి నేర్వకున్న మంచి నడత**
**పసిడి కంచమందు 'పాసిన' అన్నమౌ!**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 99

తా॥ వేదఘోష చేత విలసిల్లుతున్న గృహమందు (నివసించే) మనిషి మంచి నడవడి నేర్వకుంటే ఆ జీవితం నిరుపయోగం. వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశ్వరా! బంగారు కంచంలో పాసిపోయిన అన్నం పెడితే నిరుపయోగం కదా.

**ఆ॥ మోయలేకపోయె ముదిత యశోదమ్మ**
**తూచలేకపోయె దుడుకు సత్య**
**చూడలేకపోయె శూరుడా పార్థుండు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 100

తా॥ శ్రీకృష్ణుడు తను పాపాయి. అల్లరివాడు. ముద్దులొలికే చిన్నారికి ఏవేవో పీడలు అని విచారించింది. కాని యశోదకు పూతన, శకటాసురుడు వంటి రాక్షసులు కంసునిచే నియోగించబడిన దుర్మార్గులని తెలియదు. తృణావర్తుడు అనేవాడు సుడిగాలి రూపంలో వచ్చి



కృష్ణుని అమాంతం ఎత్తుకుని పోవాలని అనుకున్నాడు. కృష్ణుడు విపరీతంగా తన బరువు పెంచి నవ్వుతూ కేరింతలు కొడుతున్నాడు. ఏమిటీ పాడుగాలి అనుకుని పాపడిని లోపలికి తీసుకెళదామనుకున్న యశోద పిల్లవాడిని కదిలించలేక పోయింది. ఆశ్చర్యపడుతుండగా వెంటనే మామూలుగా అయ్యాడు. తన 'మొగుడు బరువు' తనకు తెలియదా? నా శ్యమంతక మణి ఒక్కరోజు ఇచ్చే బంగారం కంటే బరువా? అని అహంకరించి, కృష్ణుని నారదునికి దానం ఇచ్చి బంగారంతో తూచి, బంగారం దాన గ్రహీత నారదునికి ఇచ్చి, తిరిగి కృష్ణుని నారదుని దగ్గర నుంచి కొనుక్కొని, అచ్చం తనకే ఉంచుకోవాలని మిడిసి పడ్డ సత్యభామ సవతులతో తిట్లు తిని తూచలేక అవమానింపబడింది. శూరుడు, కృష్ణుని, 'ఊరక చూచు చుండుము.... శత్రువుల్ని నేను చంపెదను.....' అని అహంకరించిన పార్థుడు,



స్వామి విశ్వరూపం చూడను కూడా లేకపోయాడు. వేంకటాద్రి వాసుడవైన వేంకటేశా! నీలీలలు అద్భుతం.

**ఆ॥ భయములోన పుట్టు భయములోన పెరుగు**
**భయములోన చచ్చు పాపి నరుడు**
**భయము దీర్చు ని'న్నభయమును' వేడడు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 101

తా॥ ఓ వేంకటాద్రి వాసా! వేంకటేశా! నరుడు నీ దారిన బడితే సరేగాని, లేకపోతే మాత్రం మహాపాపి. వాడు భయంలో పుడతాడు. ఆ భయంలోనే పెరిగి పెద్దవుతాడు. చివరికి ఆ భయంలోనే చనిపోతాడు. కాని అందరి భయం తీర్చే నిన్ను మాత్రం అభయం వేడడు. ఎంత వింత!



**ఆ॥ రావివిత్తునుంచి రావిచెట్టే వచ్చు**
**కోతి నుంచి పిల్లకోతి వచ్చు**
**ఇదియె చాలు చెప్ప ఈశ్వరుని ఉనికిని**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 102

తా॥ అసలు ఈసృష్టికర్త ఉన్నాడా? అని సందేహిస్తారు కొందరు. కాని రావి విత్తనం నుంచి రావిచెట్టే కానీ ఇంకొకటి రాదు. అదే విధంగా కోతికి కోతిపిల్లే పుడుతుంది కాని ఇంకొకటి పుట్టదు. ఈ విధానం ఆ ఈశ్వరుడున్నాడని నిరూపించడం లేదా? ఇది చాలు కదా. ఓ వేంకటేశా! వేంకటాద్రివాసా! నీ ఉనికి నిరూపించటానికి వేరే ఏమీ అవసరం లేదు.

**ఆ॥ సత్యవాక్కు కొఱకె సతినమ్మెనొక్కండు**
**సత్యవాక్కు కొరకె చచ్చెనొకడు**
**సత్యపాలనమ్ము సంకుల సమరమ్ము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 103

తా॥ వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! సత్య వాక్పాలన కత్తి సాము వంటిది. చాల కష్టం. ఆనాడు హరిశ్చంద్రుడు స్వంత భార్యను ధరకు విక్రయించాడు. దశరథ మహారాజు కైకేయి కోరిన వరం వల్ల సతి సీతతో, తమ్ముడు లక్ష్మణునితో శ్రీరాముడు వనవాసానికి వెళ్ళగా ఆ బాధ తట్టుకోలేక మరణించాడు.

ఆ॥ **చాలు పుత్రుడొకడె సవ్యసాచైనచో**
**నూరుమంది ఏల కౌరవాళి**
**కాగితంపు పూలుకల్గియు లాభమే?**
**వేంకటాద్రివాస వెంకటేశ!** 104

తా॥ సవ్యసాచియైన అర్జునుని వంటి సుపుత్రుడు ఒక్కడైనా చాలు కానీ కౌరవుల వంటి దుర్మార్గులైన కొడుకులు నూరుమంది వున్నా వ్యర్థమే కదా! వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! కాగితం పూలు



చూడటానికే గాని, పూజకి పనికి రావు. అందుకనే వాసి (అనగా నాణ్యత) ముఖ్యంగాని రాశి (అనగా ఎంత ఎక్కువ సంఖ్య అనేది) ముఖ్యం కాదు.

ఆ॥ **బాలకృష్ణజెంత బలము జూపగ నెంచి**
**భంగపడెను ఇంద్రుడంగలార్చి**
**హనుమముందు తగునె మనిషి గంతులువేయ**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 105

తా॥ శ్రీకృష్ణుని సలహా ప్రకారం తనని పూజించకుండా గోవర్ధన పర్వతాన్ని యాదవులు పూజిస్తుంటే కోపించి ఏడురోజులు పిడుగుల వర్షం కురిపించాడు ఇంద్రుడు. గోవులనూ ప్రజలను గోవర్ధన పర్వతం క్రింద జేరి తలదాచుకొమ్మని, ఏడురోజులూ ఆ పర్వతాన్ని తన చిటికిన వ్రేలిపై మోసి అందర్నీ రక్షించి, ఇంద్రుణ్ణి చేతకాని వానిగా భంగపరచాడు ఆదేవదేవుడు. ఓ వేంకటాద్రివాసా! నూరు యోజనాల సముద్రాన్ని



ఒక్క దూకుతో దాటిన ఆ హనుమంతునిముందు ఏవ్యక్తియైనా కుప్పిగంతు వేసి తను ఎంత దూరం దూకగలడో చూపిస్తె నవ్వుల పాలవుతాడు కదా! ఓ వేంకటేశా! తప్పక అవుతాడు.

ఆ॥ **హరియె నరహరయ్యె దరిజేరె ప్రహ్లాదు,**
**తార అయ్యె ధ్రువుడు హరినిపొంది,**
**వయసుతోటి ఏమి పనిలేదు హరిజేర**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 106

తా॥ కొంతమంది అనుకుంటారు. నేను చిన్నవాణ్ణి అంత గొప్ప పని చేయటం నా వల్ల అవుతుందా! అని. గొప్పపని చేయటానికి సంకల్పం, కృషి, భగవదనుగ్రహం ఉండాలి. అంతేకాని ఎంత వయస్సు వాడనేది ముఖ్యం కాదు. ఆనాడు బాల ప్రహ్లాదుడు తండ్రి చేత బాధింపబడుతుంటే స్వయంగా శ్రీహరి నరసింహుడై వచ్చి అతనిని కాపాడాడు. ధ్రువుడు తండ్రి ప్రేమకు నిరాదరించబడి శ్రీహరిని



ప్రార్థించి తండ్రులకు తండ్రి అయిన ఆ శ్రీమన్నారాయణుని ప్రేమను పొంది ఆకాశంలో ధ్రువతారయైనాడు. వేంకటాద్రివాసా! వేంకటేశా! ఇది జగమెరిగిన సత్యం.

ఆ॥ **వలలుడయ్యె తాను వంటలు జేయంగ**
**భీమసేను డపుడు విరటునింట**
**వంగినంత పోదు బంగారు ధరసుంత,**
**వేంకటాద్రివాస వెంకటేశ!** 107

తా॥ ఆనాడు భీమసేనుడు నూరు ఏనుగులను చిత్తు చేయగల బల సంపన్నుడు అయినప్పటికీ విరాట రాజు కొలువులో 'వలలుడు' అను పేరుతో వంట శాలలో వంటలు చేశాడు. కాని తమ పాంచాలిని అవమానించిన సింహబలుడైన కీచకుని చప్పుడు చేయకుండా మల్ల యుద్ధంలో మట్టి కరిపించాడు. బంగారు వస్తువు వంగినా లేదా చితికి పోయినా

దాని తాత్కాలిక ఉపయోగం తగ్గినా అసలు విలువపోదు కదా. వేంకటాద్రివాసుడవైన వేంకటేశ్వరా ఇది సత్యం.

**ఆ॥ పాలకడలిచిల్క అలనమృతమునకై**
**ఆదికూర్మమయ్యె హరియు తానె**
**మంధరమును మోసి మహిమ చూపెను నాడు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 108

తా॥ పాల సముద్రం చిలికితే అమృతమొస్తుందని తెలుసుకుని దేవతలు రాక్షసులతో రాజీపడి భాగస్తులను చేసుకుని మంధర పర్వతాన్ని కవ్వంలాగా చేసికొని వాసుకి అనే మహా సర్పాన్ని కవ్వం చిలికే తాడులాగా చేసికొని తలవైపు దానవులు, తోకవైపు దేవతలు ఉండి చిలుకుదామని ప్రయత్నించారు. పర్వతం పాలసముద్రంలో మునిగిపోయింది. నారాయణా నీవే దిక్కన్నారు దేవతలు. వాళ్ళ తెలివి



తక్కువకి నవ్వుకుంటున్నారు దానవులు. అప్పుడు ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! నీవు ఆదికూర్మంలా అవతరించి మంధరాన్ని లేపి వీపుపై మోసి వారిని ఆదుకున్నావు.

**ఆ॥ గ్రుడ్డిరాజు 'కనెను' కొడుకుల నూర్వురన్**
**పాండురాజు కనడు "పడతి సుఖము"**
**అడవిచెట్టు కేల అలర సుగంధమ్ము**
**వేంకటాద్రివాస వెంకటేశ!** 109

తా॥ వేంకటాద్రి వాసుడవైన వేంకటేశ్వరా నీ లీలలు అర్థం కావయ్యా. పుట్టు అంధుడైన ధృతరాష్ట్రుడు వందమంది కొడుకుల్ని కన్నాడు. మహా వీరుడై రాజ్యాన్ని పెంచి సుసంపన్నం చేసిన పాండురాజు స్త్రీతో ఉంటే చనిపోతాడనే శాపంతో పడతి సుఖానికే దూరం అయ్యాడు. అడవిలో మల్లెలు సంపెంగలు పూచి గుభాళిస్తే ఎవరికి ఉపయోగం?



**ఆ॥ యమున దారియిచ్చె ఆ వసుదేవుకున్**
**సాయపడెను నాడు సకల జగతి**
**దైవసాయమున్న తప్పును కష్టాలు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 110

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశ్వరా! దైవము అనుకూలించి సహాయపడితే కష్టాలు వాటంతట అవే తొలగిపోతాయి. వసుదేవుడు తన బిడ్డను యశోద బిడ్డతో మార్పిడి చేయాలని పరమాత్మ అశరీర వాణిగా దైవాజ్ఞ అయింది. ఆ పనికి పూనుకున్నాడతడు. కలిగే ఎన్నో అడ్డంకులలో యమునా నదిని దాటుట ఒకటి. యమునా నది రెండు పాయలుగా విడిపోతూ నడిచి వెళ్ళటానికి సాయపడింది. సకల జగత్తు సహకరించింది. వాన వస్తుంటే తడిసిపోకుండా శేషుడు పడగ గొడుగులా



పట్టాడు. అందరూ గాఢ నిద్రలోకి జారుకున్నారు. పిల్లవాడు తట్టలో తీసుకుపోబడుతున్నా నవ్వుతున్నాడే గాని ఏడ్చుట లేదు. వసుదేవుడి పని నెరవేరింది.

**ఆ॥ సింహబలుని వలన చింతించె సైరంధ్రి**
**వాలి చచ్చి తాను వగచె తార**
**దేవుడెదురుదిరుగ ఎవరేమి చేతురు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 111

తా॥ ద్రౌపది పాండవుల అజ్ఞాత వాసంలో విరటుని ఇంట వాని భార్య సుధేష్ణకు చెలికత్తెలా కాలం వెళ్ళబుచ్చింది. సుధేష్ణ సోదరుడు కీచకుడనేవాడు సింహబలుడు. పైగా స్త్రీ లోలుడు. సైరంధ్రిగా వున్న ద్రౌపదిని చూచి మోహించి ఆమె కావాలని బలవంతం చేసి భీముని మాయోపాయంతో నర్తన శాలలో గుట్టుచప్పుడు కాకుండా చంపబడ్డాడు.

సుగ్రీవుడు మళ్ళీ వెంటనే యుద్ధానికి పిలుస్తున్నాడంటే ఏదో మోసం ఉంది అని చెప్పినా భార్య తార మాట వినక వాలి రాముని చేతిలో చచ్చాడు. తార దుఃఖించింది. ఆ దేవుడే శత్రువయితే ఓ వేంకటేశ్వరా! వేంకటాద్రి వాసా! ఎవరు మాత్రం ఏం చేయగలరు. ఆ కష్టాలు అనుభవించక తప్పదు.

**ఆ॥ పౌండ్రకుండు తానె 'వాసుదేవుడ'ననెన్**
**అనె హిరణ్యకశిపు "దధివుడేను"**
**పుత్తడౌనె పుడమి ఇత్తడియెన్నడున్**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 112

తా॥ వేంకటాద్రివాసుడవైన ఓ వేంకటేశా! ద్వాపరయుగంలో పౌండ్రక వాసుదేవుడను పేరుగల రాజు అహంకరించి ఆ కృష్ణుడెవడు? నేనొక్కడినే వాసుదేవుడను అని హరిద్వేషియై నశించాడు.



కృతయుగంలో హిరణ్యకశిపుడు తనే దేవుడినని అందరూ హరినామ సంకీర్తనను వదిలి తన నామ సంకీర్తన చేయాలని శాశించాడు. ఈ ప్రపంచంలో ఎన్నడైనా ఎక్కడైనా ఇత్తడి పుత్తడి (బంగారం) అవుతుందా?

**ఆ॥ అంధుడైనరాజు అతిప్రేమ నటియించి**
**భీము చంపబోయె బిగియ బట్టి**
**చింతచచ్చి నంత అంతమౌనె పులుపు?**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 113

తా॥ భీమసేనుడు తన నూర్వురు పుత్రులను పొట్టన పెట్టుకున్నాడని అంధుడై ఏమి చేయలేని ధృతరాష్ట్రుడు మనస్సులో కుతకుతలాడిపోతున్నాడు. పైకి ప్రేమ నటిస్తూ నాయనా! భీమా! ఒక్కసారి నాదగ్గరకు రా తండ్రీ! అని ప్రేమగా పిలిచాడు. ఆయన కౌగిలిలో



చేరబోతున్న భీముని ఆపి శ్రీకృష్ణుడు ఇనుముతో చేసిన ద్వారపాలకుని విగ్రహాన్ని ఆ ధృతరాష్ట్రుని ముందు ఉండేట్లు చేశాడు. ఆయన ఆ ఇనుప విగ్రహాన్ని కౌగలించుకొని నుగ్గు చేశాడు. ముసలి వాడి బలానికి అందరూ వణికి పోయారు. ఆ తర్వాత అయ్యో ఎంత పని జరిగిందని బాధ నటిస్తున్న ఆయనతో కృష్ణుడు నవ్వుతూ అసలు విషయం చెప్పి శాంతించమని ఓదార్చాడు. వేంకటాద్రివాసుడవైన వేంకటేశా! చింత చచ్చినా పులుపు చావదంటే ఇదే.

**ఆ॥ తాను దానమిచ్చి దయగొనె 'బలి' నాడు**
**ఇంద్రుడింతి చెరిచి హీనుడయ్యె**
**జన్మ లెక్క కాదు చరితమే ముఖ్యము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 114



తా॥ బలిచక్రవర్తి వామనుడైన శ్రీమహావిష్ణువుకే తను మూడడుగులు దానం ఇచ్చి ఆయన దయకు పాత్రుడై శ్రీహరి దయను పొంది రసాతలానికి ప్రభువైనాడు. త్రిలోకాధిపతి ఇంద్రుడు అహల్యను చెరిచి హీనమైన శాపం పొంది అవమానం పాలయ్యాడు. ఎవ్వరికైనా ఘనత కలిగించేది వారి నడవడే కాని రాక్షసుడా దేవతా అనే జన్మ ముఖ్యం కాదు. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశ్వరా! ఇది నిజం.

**ఆ॥ తిరిపెమెత్తి బ్రతికిరా రోజు పాండవుల్**
**పండ్లు తినుచు సీత బ్రతికె వనిలో**
**నుదుటి గీత చెరుప కాదయ్య సాధ్యము**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 115

తా॥ ఆనాడు పాండవులు ఏక చక్ర పురంలో బిచ్చమెత్తి బ్రాహ్మణులు అనిపించు వేష ధారణలో బ్రతుకు గడిపారు. ధశరథ మహారాజు గారి కోడలు సీత వనవాసంలో పండ్లు తిని జీవించింది. బ్రహ్మ దేవుడు మన కర్మ ఫలం అనుభవించమని మన నుదుటిమీద 'బ్రహ్మరాత' వ్రాసి పంపిస్తాడు. దానిని అనుభవించాల్సిందే. ఆ వ్రాత చెరపడం కాని, మార్చటం కాని అసాధ్యం. ఓ వేంకటాద్రి వాసా! వేంకటేశా! నీవే కష్టాలు అనువించావు. మేమెంత?

**ఆ॥ గుహుడు రామపదము కోరికడిగినాడు**
**ఉడుత సాయమయ్యెనుర్వి ప్రభుకు**
**పుణ్యవశము చేత పుడమి భాగ్యముకల్గు**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 116



తా॥ ఓ వేంకటాద్రి వాసా! వేంకటేశా! ఈ ప్రపంచంలో సిరి సంపదలు, భోగ భాగ్యములు, పేరు ప్రతిష్టలు జీవులకు, వారి పూర్వజన్మ సుకృతం చేత కలుగుతాయి. అంతేకాని జన్మచేత కాదు. రామాయణ కాలంలో ఆ పరంధాముడి అవతారమైన శ్రీరామచంద్రుని చూస్తేనే జన్మ ధన్యమైంది అనుకునేవారు. ఇక ఆయనను చేతులారా సేవించాలంటే ఎంత పుణ్యం చేసి ఉండాలో కదా. పడవ నడిపే గుహుడు నీ పాదరజం తగిలితే నా పడవ అహల్యవంటి స్త్రీ అయితే నాకు తంటా స్వామీ నీ కాళ్ళు కడిగాకే నా పడవ ఎక్కు అని నీ కాళ్ళు కడిగాడు. నీవు సేతువు నిర్మిస్తున్నప్పుడు ఒక ఉడుత సముద్రపు గట్టున ఇసుకని తన తడి ఒంటికి అద్దుకుని సేతువు దగ్గర రాళ్ళమధ్య విదిల్చి, ఇలా చేస్తు తను కూడా సేతువు నిర్మాణంలో నీకు సాయపడింది. అదీ జన్మంటే.



**ఆ॥ అష్ట భార్యలయిన అతివలు వేలైన**
**అస్థలితుడ వీవె అమలుడీవె**
**ఆది లేదు నీకు అంత్యము లేదయ్య**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 117

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! నీకు ఆది అనేదే లేదు, అంత్యము లేదు. అంటే ఆరంభం లేదు. అంతమూ లేదు. మరి ఈ పురాణ కథలు నీ లీలలూ అన్నీ భక్తితో మహా ఋషుల హృదయాల నుంచి పుట్టిన ఆలోచనలే. నీకు ఎనిమిది మంది భార్యలూ వాళ్ళకి ఒక్కొక్కరికి పదిమంది పుత్రులు. నీవు కాపాడి నీ స్త్రీలని ఆశ్రయమిచ్చిన పదియారు వేలమంది రాకుమార్తెలు. ఇదంతా చూచి నీవు స్త్రీ లోలుడవని టక్కరి వాడవని కథలు వ్రాసే వారు ఎందరో "గ్రంధ సాంగులు". ఎంత విచిత్రం? ఎంత అజ్ఞానం? నీవు పరమాత్మవు. అస్థలితుడవైన నీకు మలినం ఎలా వుంటుంది?



**ఆ॥ హరియనంగ నెవరు? హరుడన్ననెవ్వరు?**
**భద్రకాళి యెవరు? బ్రహ్మయెవరు?**
**మనిషి ఊహలందు పరమాత్మ రూపమే**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 118

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! సత్యమేమిటంటే సృష్టికర్తా, భర్తా హర్త పరమాత్మ రూపుడవైన నీవే. సృష్ట్యాది నుంచి జ్ఞానులు వారి వారి నమ్మకాల ద్వారా నిరాకారుడైన పరబ్రహ్మకు వారికి నచ్చిన ఆకారం ఆపాదించి పూజించారు. నీలమేఘ శ్యాముడైన శ్రీహరి, త్రినేత్రుడైన శంకరుడు, సర్వ భక్షిణియైన భద్రకాళి, చతుర్ముఖుడైన బ్రహ్మ మొదలయిన వారంతా మనిషి ఊహామూర్తులే. అసలున్నది పరబ్రహ్మే. దానిని నేను నీరూపంలో ఆరాధిస్తున్నాను.

ఆ॥ **అతివ కాశ పడిన ఆ నహుషుడు నాడు**
**సర్పమయ్యె ఋషుల శాపమంది**
**కన్నుమిన్ను గనక కష్టాలపాలయ్యె**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 119

తా॥ ఇంద్రుడు రాక్షసుల బాధ తట్టుకోలేక ఎక్కడికో పారిపోయాడు. దేవతలు లోకాల పాలన కోసం నహుషుని బ్రతిమాలి, మరీ ఇంద్రునిగా నియమించు కున్నారు. కానీ అహంకారం నెత్తికెక్కిన నహుషుడు ఇంద్రుడి భార్య శచీదేవి కూడా తనకు కావాలని పట్టుబట్టాడు. సప్త ఋషులు మోసిన పల్లకీలో వస్తె తను సిద్ధమే అంది ఆవిడ. అలాగే వస్తున్నాడు నహుషుడు. తొందర పడుతున్నాడు. దుర్వాసుడు పొట్టివాడు లావుపాటివాడు అవటం వల్ల ఆయాస పడుతున్నాడు. కామాతురుడైన నహుషుడు ఆయన్ని



"సర్ప! సర్ప!" (అంటే తొందరగా తొందరగా అని అర్థం) అని తన్నాడు. కోపం తట్టుకోలేని దుర్వాసుడు నహుషుని సర్పమయిపోమని శపించాడు. వెంటనే నహుషుడు సర్పం అయిపోయాడు. వేంకటాద్రి వాసుడవైన ఓ వేంకటేశా! కన్ను మిన్ను కానని వారికి కష్టాలు తప్పవు.

ఆ॥ **సృష్టి ఆదిఎవడు సృజియించు నెవ్వండు**
**సృష్టి పెంచునెవడు పుష్టినిచ్చి**
**కానలందు సృష్టి గరపనెవ్వరి కొను**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 120

తా॥ ఓ ప్రభూ ఈ సృష్టికి మూలపురుషుడైన వాడెవరు? సృష్టికర్త ఎవడు? ఈ సృష్టికి వృద్ధినిస్తున్నది, వృద్ధి చేస్తున్నదెవరు? ఎక్కడో చీమలు దూరని చిట్టడివిలో కాకులు దూరని



కారడవుల్లో అనంత సాగర గర్భంలో సృష్టి చేసి పోషించుట ఎవరికి సాధ్యం? ఓ వేంకటాద్రివాసా ! వేంకటేశా! నీకే ప్రభూ!

ఆ॥ **పద్యమొకటికాదు వందకు పైనుండె**
**ఆటవెలది చదువ 'ఆట' గాదె!**
**నిన్నుగొలుతునయ్య నిలువుము మకుటమై**
**వేంకటాద్రివాస వేంకటేశ!** 121

తా॥ ఓ వేంకటాద్రివాసా! వేంకటేశా! ఒక్క పద్యం కాదు వందకు పై సంఖ్యలోనే ఉన్నాయి. ఇవి ఆటవెలదులు (ఆట వెలది పద్యాలు). చదువుట బహు తేలిక. ఆట ఆడుకుంటున్న తీరుగా వుంటుంది. ఇవన్నీ నిన్ను కీర్తించి ప్రార్థించుటకు కనుక నువ్వు మకుటంగా నిలిచి శోభిస్తుంటే నా జన్మ చరితార్థమవుతుంది.



ఓం నమో వేంకటేశాయః
ఓం నమో వేంకటేశాయః
ఓం నమో వేంకటేశాయః



Century Old Photo of Tirumala God
AMARAVADI SUBRAHMANYA DEEKSHITULU